కరీంనగర్ సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం 19 జనవరి 2024 10పేజీలు



## అయోధ్య రామయ్యకు సిరిసిల్ల బంగారు చీర

సూర్య రాజన్న సిరిసిల్ల



(వివరాలు 2లో)

# 'ఖని'లో ఏరులై పారుతున్న కల్తీకల్లు





- నెల క్రితం ఒకరు, తాజాగా ఇద్దరు కల్తీకల్లుకు బలి
- శాంపిల్స్ సేకరణ జరుగుతున్నా.. మరణాలు మాత్రం ఆగడం లేదు
- లోగుట్టు ఆ పెరుమాళ్ళకే ఎరుక

సూర్య-గోదావరిఖని:

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మరోమారు కల్తీకల్లు పడగ విప్పింది. వివరాల్లోకి వెళితే బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడి రమేశ్, నాంపల్లి నవీన్ దుర్గానగర్‌లోని ఓ ప్రవేటు కాంట్రాక్టర్ వద్ద కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం పని ముగించుకొని అడ్డగుంటపల్లిలోని కల్లు డిపో లో కల్లు తాగారు. రాత్రి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో స్థానిక ఆర్యవైశ్య భవన్ సమీపంలో కిందపడ్డారు. నవీన్ సోదరుడు అంజి వారిని తీసుకెళ్లేందుకు రాగా, అప్పటికే మృతి చెందారు. అయితే కల్తీ కల్లు తాగడం వల్లే మృతి చెందినట్టు మృతుల బంధువులు ఆరోపించారు. ఇదిలా ఉండగా కొంతమంది గీత సహకార సంఘం పేరుతో కల్తీ కల్లు విక్రయిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు ఇక్కడ బలంగా వెలువడుతున్నాయి. కార్మికులు, రోజువారి కూలీల కడుపులు కొడుతూ అడ్డంగా సంపాదిస్తున్నారు. (మిగతా 2లో)



## ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని
# కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కోరుకుంటున్నారు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్
- ఈనెల 28న కరీంనగర్‌కు అమిత్ షా రాక
- బీజేపీని గెలిపిస్తేనే తెలంగాణకు కేంద్రం అదనపు నిధులు

సూర్య రాజన్న సిరిసిల్ల

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు.సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాలులో జరిగిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఈనెల 28న కరీంనగర్ రానున్నారు. ఆరోజు బీజేపీ నిర్వహించే క్లస్టర్ సమావేశానికి హాజరుకా నున్నారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని క్రియాశీల కార్యకర్తలతో నిర్వహించే సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సమ్మేళనంలో ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలోని 20 మంది కార్యకర్తల చొప్పున పార్లమెంట్ పరిధిలో దాదాపు 40 వేల మంది (మిగతా 2లో)



## కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన వారు
# లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలి

**భారత ప్రధాని నరేంద్రమోదీ**

సూర్య చొప్పదండి

ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ స్వగ్రా మంలో వ్యవసాయం పై మక్కువ చూపే మల్లికార్జున్ రెడ్డి లాంటి వారు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేల యువతకు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గురువారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధాని న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు.





కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ చొప్పదండి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ యోగేష్ మోహన్ దీక్షిత్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి లతో ఎంపీ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొని తెలంగాణ, రాజస్థాన్, హర్యానా, మేఘాలయ, మహారాష్ట్ర, రాష్ట్రాలకు చెందిన వారితో మాట్లాడుతూ (మిగతా 2లో)

# ‘ఖని’ లో ఏరులై పారుతున్న కల్తీకల్లు

(మొదటి పేజీ తరువాయి)

వింత మత్తును అలవాటు చేసి వారి కుటుంబాలను వీధిన పడేయడంతోపాటు, ఒల్లు గుల్ల చేసి ఆస్పత్రుల చుట్టూ తిప్పిస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో కేసుల నుంచి తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా ఏ నాయకుడు గట్టిగా చర్యలకు పట్టుబడకపోవడం, అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి కల్లు షాంపిల్స్ సేకరించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారుతోంది. పంపిన శాంపిల్స్ కు లేబరేటరీ లో ఏ విధమైన రిపోర్ట్ ఇస్తున్నారు, ఆ రిపోర్ట్ పై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా అనే విషయాలపై అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేదు. ఏదో శాంపిల్స్ సేకరిస్తున్నాం.. పంపిస్తున్నాం.. అంతే... నెలనెలా మాకు వచ్చేది యధావిధిగా వస్తుంది.. మాకేంటి అనే ధోరణిలో అధికారులు ఉన్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇదే కలుడిపోకు చెందిన ఫైవింక్లైన్ కల్లు దుకాణం లో ఒక వ్యక్తి చనిపోగా ఆ విషయాన్ని బయటికి రాకుండా సదరు కల్లు డిపో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవడం, అధికారులు సైతం వారికి వత్తాసు పలకడంతో ఇప్పుడు మరో ఇద్దరు బలి కావలసి వచ్చింది. కల్తీకల్లుకు నిరుపేదలే బలి అవుతున్నారు.. ప్రశ్నించేవారు లేరు కదా అనే ధీమాతో కలుడిపో నిర్వాహకులు ఉన్నట్లు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. డిమాండ్ ఎక్కువ, ఉత్పత్తి తక్కువగా ఉండటంతో కల్లు డిపోల నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి కల్తీ కల్లు అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. 100 లీటర్ల ఒరిజినల్ కల్లులో మెగ్నీషియం, అల్యూమినియం సల్ఫేడ్ వంటి రసాయనాలు కలిపి 500 లీటర్ల కల్లుగా మార్చడం, మత్తు కోసం క్లోరల్ హైడ్రేట్, ఆల్ఫాజోలెం, డైజోఫాం వంటి ప్రమాదకరమైన రసాయనాలు సైతం వాడుతున్నారనే ప్రచారం జరుగుతుంది. దీనివల్ల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కళ్ళు పోవడం, మెదడు సరిగ్గా పనిచేయకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మూత్రపిండాల వ్యాధులు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు ప్రాణాలు సైతం పోతున్న ఘటనలు లేకపోలేదు. మద్యం సేవించే అలవాటున్న వారు సైతం ఈ రసాయనాలు కలిపిన కల్లు ఒక్క సీసా తాగితే ఔట్ అవడం ఖాయమట. ఈ కల్తీ కల్లుకు ఒకసారి అలవాటైతే దాన్ని వదిలించుకోవడం కష్టమని చెబుతున్నారు. కొవిడ్ సమయంలో కల్లు డిపోలు మూతబడటంతో కల్తీ కల్లు దొరకని పరిస్థితిలో వందల మంది పిచ్చి పట్టినట్లుగా ప్రవర్తించారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడితే, మరికొందరు ఉన్మాదుల్లా ప్రవర్తించారని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఇంత జరుగుతున్న కల్తీ కల్లుకు అడ్డుకట్ట వేయటానికి ప్రభుత్వం నుండి కనీస చర్యలు లేవు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏర్పాటైన బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్తీ కల్లు నేపథ్యంలో మూతపడ్డ కల్లు దుకాణాలను మళ్లీ తెరిపించారు. ఆ పాపం ఊరికే పోలేదంటూ పలువురు బహిరంగంగా చర్చించుకోవడం కొసమెరుపు. అయితే నిరుపేదల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ఈ కల్తీ కల్లు దందాకు ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తుందా.. వేచి చూడాల్సిందే.

## పేదరిక నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో నిలిచింది

**- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



నీతి ఆయోగ్ సంస్థ ప్రతి ఏడాది వివిధ అభివృద్ధి కార్యక్రమాల పని తీరు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేదరికం ఏ విధంగా నిర్మూలన చేయడం జరిగింది అనే దానిపై ప్రకటన చేయడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రం పేదరిక నిర్మూలన లో ముందు వరుసలో నిలవడం గర్వంగా ఉందని కరీంనగర్ మాజీ పార్లమెంటు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.కరీంనగర్ లోని క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పుడు రాష్ట్రంలో 13.18 శాతం మంది ప్రజలు కటిక దరిద్రంలో ఉండే వారని ఇటీవల నీతి ఆయోగ్ సంస్థ దేశవ్యాప్తంగా 10 అంశాలపై సర్వే నిర్వహించిందని, తెలంగాణ లో 12 అంశాలపై సర్వే నిర్వహిస్తే 13.18 శాతం నుంచి 3.76శాతానికి పేదరికం నిర్మూలన తగ్గిందని స్వయంగా నీతి ఆయోగ్ సంస్థనే పత్రిక ప్రకటన జారీ చేసిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం తగ్గిందని, దీనికి ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ గారు సీఎం అయ్యాక గోదావరి, కృష్ణ నదులపై ప్రాజెక్టుల,తెలంగాణ లో ఉన్నటువంటి 44 వేల చెరువులను పునరుద్ధరించడం ద్వారా రెండు పంటలకు సాగునీళ్లు ఇవ్వడంతో పాటు వ్యవసాయ విస్తీర్ణం పెరగడంతో పాటు ధాన్యం ఉత్పత్తి లో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు...గ్రామాల్లో సర్పంచ్ లు గ్రామాల్లో పరిశుభ్రత వంటి అంశాలపై శ్రద్ధ పెంచడంతో, అనారోగ్య కారణాల నుంచి ప్రజలు బయట పడ్డారు.అటవీ ప్రాంతాల్లోని గిరిజన బిడ్డలు అనారోగ్యం నుంచి బయట పడ్డారు.పట్టణ ప్రాంతాల్లో పేదరికం పోయిందని పారిశ్రామిక రంగాలకు 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో కార్మాగారాలు మూడు షిఫ్టుల్లో పని చేయడం ద్వారా నిరుద్యోగం వంటి సమస్య లేదన్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ ఉద్యమ నేత ,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నీ రంగాల్లో అభివృద్ధి చేశారు కాబట్టే తెలంగాణ రాష్ట్రం పేదరిక నిర్మూలన రాష్ట్రంగా దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**సూర్య రుద్రంగి**



నియోజకవర్గంలో ప్రజల సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తున్నా మని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యలయంలో అధికారులు, గ్రామస్తులు, నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమావేశం నిర్వహించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. వారి సమస్యలపై ఇచ్చిన ఆర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మండలంలో ప్రజలతో నేరుగా సమస్యలను తెలుసుకొని వారి సమస్యలు పరిష్కారించేవిధంగా కృషి చేస్తానన్నారు. మండలంలో ప్రభుత్వ కార్యాల యాలకు పక్క భవనాలు, ప్రభుత్వ ఆసుపత్రి, రోడ్లు, ప్రధాన రహదారి వెంబడి సైడ్ డ్రైనేజ్ వంటి పలు సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు పంపించడం జరిగిందన్నారు. ప్రజాప్రతి నిధులు, నాయకులు సూచనల మేరకు మండలాన్ని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు సమిష్టిగా ఉండి తనకు సమస్యలు తెలిపితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. గ్రామస్తులు తమ సమస్యలపై నేరుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు విన్నపించు కున్నారు. వారి నుండి ఆర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తర్రె ప్రభలత-మనోహర్, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ సుధకార్, అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, నాయకులతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం

**- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**సూర్య గొల్లపల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపెల్లి మండలం శ్రీరాముల పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం అంగన్వాడిల ఆద్వర్యంలో నిర్వహించి న అన్నప్రాసన, అక్షరాభ్యాసం. శ్రీమంతం .కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ పరిధి పెంపు వంటి హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. గొల్లపెల్లి మండలం శ్రీ రాములపల్లి గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, జెడ్పిటీసీ గొస్కుల జలంధర్,సర్పంచ్ నేరెళ్ల గంగారెడ్డి, ఉప సర్పంచ్ ఏలేటి అసిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ కంపెల్లి హనుమన్లు, ఎంపిటీసీ లంబ దనవ్వ లక్ష్మణ్, సీనియర్ నాయకులు సురేందర్, నేరెళ్ళ మహేష్, వార్డు సభ్యులు కో ఆప్షన్ మెంబర్లు మండల ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా కోరుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు పాల్గొననున్నారని తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ సర్కారేననే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీ నుండి అత్యధిక మంది ఎంపీలు గెలిస్తేనే తెలంగాణకు అదనపు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించాలంటే మోదీతోనే సాధ్యమనే భావన కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తామని ఆ పార్టీల కార్యకర్తలు కూడా చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ, గంగాడి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాష్ట్ర నాయకులు మీసాల చంద్రయ్య, క్రిష్ణారెడ్డి, చెన్నమనేని వికాస్ రావు, ఆరెపల్లి మోహన్, బాస సత్యనారాయణ, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన వారు లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ శాఖల స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొని తెలంగాణ, రాజస్థాన్, హర్యానా, మేఘాలయ, మహరాష్ట్ర, రాష్ట్రాలకు చెందిన వారితో మాట్లాడుతూ వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మొదటగా చొప్పదండి మండలం పెద్ద కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున్ రెడ్డి తో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసించి కార్పోరేట్ సంస్థలో మంచి ఉద్యోగాన్ని వదులుకొని స్వగ్రామంలో వ్యవసాయం చేస్తున్న మల్లికార్జున్ ఎంతో మందికి ఆదర్శమని ప్రధాని అభివర్ణించారు. అనంతరం ప్రధానమంత్రి యోజన పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పొందిన లబ్ధిని గురుంచి వివరాలను మరియు మల్లికార్జున్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే సెమినార్‌ల ద్వారా మల్లికార్జున్ లాంటి వారు యువతకు స్వయం అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. వ్యవసాయంలో భర్తకు చేదోడుగా నిలుస్తున్న మల్లికార్జున భార్య లాంటి వారు భారత నారి శక్తులని అభివర్ణించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న పలు పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధి దారులకు చేర్చడం తో పాటు పథకాలను గురుంచి అవగాహన కల్పించే దిశగా ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అనుకున్న లక్ష్యాలను చేరుకోగలిగిందని, ఈ సంకల్ప యాత్రను ఫిబ్రవరి 2024లో కూడా కొనసాగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ ,డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ యోగేష్ మోహన్ దీక్షిత్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎల్డియం ఆంజనేయులు, సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, పిడి మెప్మా రవీందర్, ఎన్ఐఓ శ్రీరాములు, వార్డ్ కౌన్సిలర్ మాధురి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శాంత కుమార్ , వివిధ శాఖల, అధికారులు బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రామయ్యకు సిరిసిల్ల బంగారు చీరె

**- చీరెలోనే రామాయణ ఇతివృత్తానికి సంబంధించిన చిత్రాలు**

**- 26న ప్రధానికి అందించనున్న చీరె**

**- నేతన్న హరిప్రసాద్ తయారు చేసిన చీరెను పరిశీలించిన బండి సంజయ్**

**సూర్య రాజన్న సిరిసిల్ల**



అయోధ్య శ్రీరామచంద్రుడి పాదాల చెంత సిరిసిల్ల నుండి బంగారు చీరను ఉంచనున్నారు. సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్ తన చేతులతో స్వయంగా తయారు చేసిన బంగారు చీరెను ఈనెల 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా రాముడి పాదాల చెంత చీరెను ఉంచనున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలోని హరిప్రసాద్ నివాసానికి వెళ్లారు. హరి ప్రసాద్ స్వయాన తయారు చేసిన బంగారు చీరెను పరిశీలించారు. శ్రీరాముడి చిత్రంతోపాటు రామాయణ ఇతివృత్తాన్ని తెలియజేసే చిత్రాలను సైతం ఆ చీరెలో పొందుపర్చడం విశేషం. 8 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండితో తయారు చేసిన చీర అందరినీ అబ్బురపరిచేలా ఉంది. అద్భుతంగా చీరెను తయారు చేసిన హరిప్రసాద్‌ను ఈ సందర్భంగా బండి సంజయ్ అభినందించారు. శాలువాతో సత్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్ స్వయాన తన చేతులతో తయారు చేసిన బంగారు చీరె చాలా బాగుందన్నారు. ఈనెల 26న ప్రధానికి చీరెను అందించనున్నారని, ప్రధాని చేతుల మీదుగా శ్రీరాముడి పాదాల చెంతను ఉంచేందుకు సిద్ధమవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో అగ్గిపెట్టెలా చీరెను ఉంచిన చరిత్ర సిరిసిల్ల జిల్లాదన్నారు. ఇంతటి గొప్ప నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న చేనేత రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేనేత కార్మికులను ఆదుకునేందుకు తనవంతు క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు.

# బిఆర్ఎస్ ను వీడేది లేదు

## - మార్పు అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమా....!? - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బిఆర్ఎస్ పార్టీని వీడేది లేదని, కేసిఆర్ కుటుంబంతోనే నా ప్రయాణం ఉంటుందని హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు ఎమ్మెల్సీ, విప్ పదవి ఇచ్చి ఎమ్మెల్యే టికెట్ కూడా ఇచ్చినా ఎదుగుదలకు కారణమైన బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ను వీడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఎవరికి ఎలాంటి అనుమానాలు అక్కరలేదని నియోజకవర్గంలోని తమ పార్టీ ప్రజా ప్రతినిధులను కాపాడుకుంటూ వారికి అండగా ఉంటానని అన్నారు. నా గెలుపు కోసం కృషి చేసిన వారి మేలు మరువనని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో వారిని గెలిపించుకుంటానని అన్నారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో నా వాణి ని వినిపిస్తానని అన్నారు.

**మార్పు అంటే ప్రజలని ఇబ్బంది పెట్టడమా....!?**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మార్పు రావాలని చెప్పిందని, మార్పు అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమా అని ఆయన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్



పార్టీపై మాజీ సీఎం కేసీఆర్ పై, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కోపం ఉంటే పెట్టుకోవచ్చు కానీ వారి మీద కోపంతో ప్రజలకు ముఖ్యంగా రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేయడమేమిటి అని అన్నారు. రైతులు నాటు వేసుకునే సమయం ఇది అని ఇలాంటి సమయంలో వరి పంట కోసం నీరు ఇవ్వకపోవడం రైతులపై కక్ష సాధింపు చర్య గా భావించాల్సి వస్తుందని అన్నారు. హుజురాబాద్ ప్రాంతంలో 1.17 లక్షల భూమి సాగు చేస్తారని, వారికి నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంతకాలం చెరువులు, వాగులు ఏ కాలంలో అయినా నీటితో కలకలలాడేవని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నీటి విడుదల చేయకపోవడంతో వాగులో మిర్రలు వస్తున్నాయని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతుకు నీరు పుష్కలంగా అందిందని, కానీ కాంగ్రెస్ నిర్లక్ష్యం మూలంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకు నీరందేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. దళిత బంధు హుజురాబాద్ నియోజకవర్గం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 18 వేల మందికి దళిత బంధు అందించామని అన్నారు. సుమారు 1500 మంది దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత డబ్బులను బ్యాంకులో ఫ్రీజ్ చేశారని, వెంటనే ప్రభుత్వం స్పందించి దళిత బంధు నిధులను విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళిత బంధు పది లక్షల బదులుగా 12 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఫ్రీజ్ చేయడమేమిటి అని అన్నారు. మార్పు రావడం అంటే దళిత బంధు కరెంటు సంక్షేమ పథకాలు ఆపడమేనా అని ఆయన ప్రశ్నించారు. రుణమాఫీ చేస్తామని చెప్పిన విషయం ప్రభుత్వం మరిచిపోరాదని అన్నారు. టిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే సహించేది లేదని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, జడ్పిటిసి బక్కారెడ్డి, కౌన్సిలర్ రమాదేవి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాడ సాధవరెడ్డి, సత్యనారాయణ రావు, పింగిలి రమేష్, పావని గౌడ్, దిల్ శ్రీనివాస్, రమేష్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి కార్యక్రమం పార్లమెంట్ కమిటీ, తెలుగు దేశం పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య అధ్వర్యంలో ఘనంగా నిర్వహించడంజరిగినది. గురువారం కరీంనగర్ లోని బైపాస్ రోడ్ లో గల ఎన్టీఆర్ విగ్ర హానికి కళ్యాడపు ఆగయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. పార్లమెంట్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహనికు పూలమాల వేసీ ఘనంగా నివాళులు అర్పించినారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న పార్టీ ముఖ్యనాయకులు కళ్యాడపు ఆగయ్య, ఎడ్ల వెంకటయ్య, సా యిల్ల రాజమల్లయ్య, సందబో యిన రాజేశం, తీగుట్ల రమేష్ కుమార్, ఎర్రవెల్లి రవీందర్, తాటి కొండశేకర్, ఎలిమిళ్ళ కిషన్, బసాలతు ఖాన్, ఇట్ట మల్లేశం, రోడ్డ శ్రీధర్, ఆకుల కాంతయ్య, ఎర్రోజు హయగ్రీవచారి, రోడ్డ శ్రీనివాస్, ఎస్ కె. హైమధ్, వెల్మల లక్ష్మణ్ రావు, గూడ లక్ష్మణ్, ఎర్రవెల్లి వినీత్, ఎం డి.మహబూబ్ ఖాన్, దేశ నరెంధర దత్తు,ఎండి. యూసుఫ్, సాదినెని ప్రభాకర్, సర్దార్ జోగెందర్ సింగ్, వేముల రాజేశం, కుంబాల కిష్టయ్య, కొత్తకొండ చంద్రయ్య,బుర్ర రామచంద్రం గౌడ్,ఉల్లెందుల నర్సయ్య, మేకల రాయమల్లు, కుమ్మరి రమేష్, తాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైలారం మల్లికార్జున స్వామి జాతర తేదీ ఖరారు

**సూర్య గన్నేరువరం**



మైలారం మల్లికార్జున స్వామి జాతర తేదీలు ఆలయ కమిటీ చేర్మెన్ వరాల పర్శరాములు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జాతర తేదీలు ఖరారు చేశారు. తేదీ 27 - 01-2024 శనివారం రోజున స్వామి వారి పల్లకి సేవ ఒగ్గు పూజారులచే ఊరేగింపు, తేదీ 28-01-2024ఆదివారం రోజున స్వామి వారి కళ్యాణం, పెద్దపట్నాలు జాతర జాతర కమిటీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మైలారం గ్రామ సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం, సాంబయ్య పల్లి సర్పంచ్ చింతలపెల్లి నర్సింహా రెడ్డి, సమ్మక్క సారాలమ్మ చేర్మెన్ విలసాగరం రామచంద్రం, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

**సూర్య, హుజురాబాద్ రూరల్**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికీ చెందిన కోమటి రంజిత్ కుమార్(24) కుటుంబాన్ని టిఆర్ఎస్ నాయకులు సందర్శించి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి క్వింటా బియ్యం, నూనె ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ చిలకమారి శ్రీనివాస్, బండారి సదానందం, సబ్బని రాజేందర్, లక్కీ సెలక్షన్ అశోక్, సంఘం సత్యనారాయణ, ఇప్పలపల్లి చంద్రశేఖర్, కుడికాల సాయి, ఇప్పలపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**సూర్య, హుజురాబాద్**



2024 - 2025 విద్యా సంవత్సరానికి గాను హుజురాబాద్ క్యాంపు లోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5 వ తరగతి, ఇంటర్మీడియట్ లో ఖాళీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్ల గాను, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి గ్రూపులలో మొదటి సంవత్సరం 80 సీట్లకు గాను అర్హులైన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా tmreistelangana.cgg.gov.in% లేదా TMREIS యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ నెల జనవరి 18 నుండి ఫిబ్రవరి 6 వ తేది వరకు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు. 75 శాతం మైనార్టీలకు(ముస్లింలు , క్రిస్టియన్లు, పార్శీలు, జైనులు, సిక్కులు, బుద్ధిస్తులు) 25 శాతం నాన్ మైనార్టీలకు సీట్లు రిజర్వు చేస్తారని, ఇతర సలహాల కోసం 7331170850, 7636035453 ఫోన్లను సంప్రదించాలని కోరారు.

## రాములవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

### - మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



రాములవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ లోని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కు విశ్వహిందూ పరిషత్ సభ్యులు గురువారం అయోధ్య రాములవారి అక్షింతలతో పాటు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, గడ్డం నాగరాజు, ద్యావ మధుసూదన్ రెడ్డి, సాయికృష్ణ, విశ్వహిందూ పరిషత్ విభాగ్ ప్రముఖ్ ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, విద్యాసాగర్, ఆంజనేయులు, రమేష్, మనోజ్ లాహెూటి, తదితరులు పాల్గొన్నారు.



## టీజేఎస్ పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య, హుజురాబాద్**

తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21 న హైదరాబాద్ లో జరిగే సదస్సు పోస్టర్ ను తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు గురువారం హుజురాబాద్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణలను విభజన చేసిన సమయంలో తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గత పది సంవత్సరాలుగా ఏ ఒక్కటీ అమలు చేయక కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతం పట్ల వివక్ష చూపుతున్నందని, తక్షణమే ఆ హామీలను అమలు చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్ర సదస్సుకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. భయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో వున్న ఉమ్మడి రాష్ట్ర స్థాయి సంస్థలను, ఆస్తులను వెంటనే విభజించాలని, ఉమ్మడి రాష్ట్రంలోని ఉద్యోగుల విభజన చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కు పంపాలని, కృష్ణానది జలాల్లో న్యాయమైన తెలంగాణ వాటా తేల్చాలని, తెలంగాణ రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, ఈ హామీల పరిష్కారం కోసం అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలని ముక్కెర రాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివదయాల్ సింగ్, బత్తుల తిరుపతి, గిర్నాల కుమారస్వామి, గోపగోని సాయిరాం, బి. వీరు, బి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ ను తొలగించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు కాంగ్రెస్ పార్టీ నాయకుల వినతి పత్రం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఆదర్శనగర్ ప్రాంతంలో జనావాసాల మధ్య ఇప్పటికే ఉన్న వైన్స్ తో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఆదర్శనగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మరొక వైన్స్ ను తొలిగించాలని కోరుతు టీ.పీ.సీ.సీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీపీసీసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఆదర్శనగర్ బోర్డు పక్కకు ఇప్పటికే ఒక వైన్స్ వున్నా దాని పక్కకే మరొక వైన్స్ నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని దానికి కొంత మంది ప్రజా ప్రతినిధులు డబ్బులు తీసుకొని వారికి అధికారులు సహకరిస్తున్నట్లు అయన విమర్శించారు. ఈ ప్రాంతంలో జనావాసాలతో పాటు హాస్పిటల్స్, రామాలయం , హనుమాన్ గుడి, చర్చిలతో ఇప్పటికే చాలా రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నరనిస్ ప్రభుత్వం వెంటనే వైన్స్ నిర్మాణం కొరకు అనుమతి నిరాకరించి వైన్స్ కొరకు నిర్మిస్తున్న షటర్లకు అనుమతి ఇవ్వొద్దన్నారు.

## వల్లంపహడ్ లో అక్రమ నిర్మాణం కూల్చివేత

**సూర్య,కరీంనగర్ రూరల్**



కరీంనగర్ రూరల్ మండలంలోని వల్లంపహడ్ గ్రామంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాన్ని గురువారం రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ తహశీల్దార్ నవీన్ కుమార్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 8లో రోడ్లు భవనాలు ఆర్ అండ్ బి కి సంబందించిన పాత రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేసినారని వచ్చిన పిర్యాదు పై ఆర్డీవో ఆదేశాల మేరకు అట్టి పిర్యాదుపై విచారణ చేసి అట్టి రోడ్డుపై అక్రమంగా నిర్మాణాలు చేసిన భవనం, రేకుల షెడ్డు కాంపౌండ్ వాల్ లను ఆర్ అండ్ బి అధికారుల సమక్షంలో కూల్చివేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే.. సహించేది లేదని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమ ములో ఆర్ అండ్ బి ఏఈ లక్ష్మణ్ కుమార్, ఆర్ ఐ రజనీకాంత్ రెడ్డి, సర్వేయర్ రాకేష్, వర్క్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

### - టిపిఆర్టియు

**సూర్య, హుజురాబాద్ రూరల్**



ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి కృషి చేస్తానని టిపిఆర్టియు వ్యవస్థాపక అధ్యక్షులు, టిపిసిసి అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చెల్పూర్ గ్రామంలోని టిపిఆర్టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉపాధ్యాయ నాయకుడు ఆరె రాకేష్ రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దుతో పాటు రాష్ట్రంలోని ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యల పట్ల సీఎం రేవంత్ రెడ్డి కి అవగాహన ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలోనే ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 317 జీవోపై నిర్ణయం తీసుకొని ఉపాధ్యాయులకు న్యాయం చేస్తారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సంఘం కోసం పని చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్టియు, ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విధానం రద్దు చేయాలి

## - ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

సూర్య జగిత్యాల



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణకు కేటాయించాల్సిన విద్యాసంస్థలను కేటాయించకుండా తెలంగాణ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కౌన్సిల్ సమావేశం శివసాయిరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పూర్తిగా విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేసే విధంగా ఉందన్నారు. ఆ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర బీజేపీ ఎంపీలు గత ఐదేళ్లలో తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగులకు కేంద్రం నుంచి తీసుకొచ్చినది ఏమీ లేదని రెచ్చగొట్టి రాజకీయం పబ్బం గడుతున్న వారికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులను ఏకం చేసి వారిని ఓడిస్తమని హెచ్చరించారు. యువతకు 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని కానీ ఇప్పటికి మోదీ వారికి చేసింది ఏమీలేదని, నిజామాబాద్, కరీంనగర్ ఎంపీలు ఇద్దరూ విద్యావ్యవస్థ, యువత నిరుద్యోగంపై ఒక్క ప్రశ్న కూడా అడగరని కానీ గల్లీలో వచ్చి అడ్డగోలుగా మాట్లాడుతూ యువతను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. మోడీ చెప్పే రామరాజ్యంలో చదువుకు ప్రాముఖ్యత లేదని మోదీ రామ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు అన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ మోదీ ప్రభుత్వం ఏర్పడితే పేదలకు చదువు ఉండదు నిరుద్యోగులకు ఉద్యోగాలు రావు అని,బీజేపీ ప్రభుత్వంలో రాష్టానికి ఒక్క ఐఐఐటి , ఐఐఎం కేటాయించింది లేదని తెలంగాణ విభజన హామీలను అమలు చేయని తెలంగాణ కి స్థానం లేదని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో విద్యార్థి,నిరుద్యోగ వ్యతిరేకి, తెలంగాణ వ్యతిరేకి బిజెపిని ఓడించాలని మణికంఠ రెడ్డి విద్యార్థి, యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సంజయ్. జగిత్యాల టౌన్ ప్రెసిడెంట్ %ఉ% మీడియా ఇంచార్జి శివ సాయి రెడ్డి, (కౌన్సిల్ సభ్యుడు)రాహుల్, కౌన్సిల్ సభ్యుడు నాగరాజు, (బాలికల కౌన్సిల్ ఇంఛార్జ్ సౌమ్య, సమీర్, నునవత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

## భేటీ బచావో బేటి పడావో పై అవగాహన

సూర్య జగిత్యాల టౌన్



జగిత్యాల జిల్లా మహిళా సాధికారత బృందం వారు గురువారం జగిత్యాల లోని ఉస్మాన్ పుర లో ఉన్న మహిళలకి బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్టిక్ మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని మాట్లాడుతూ ప్రతి బాలికను చదివించాలని విద్యతోనే మహిళ సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. మహిళల పట్ల జరుగుతున్న హింసలకి వాటి నిరోధానికి మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవ్వడానికి కృషి చేయాలన్నారు. ముస్లిం మైనారిటీ లోని మహిళలకి ఉన్నత విద్య వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు, సఖి 181, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, తదితర టోల్ ఫ్రీ నెంబర్స్ గురించి అవగాహన కల్పించారు. ఇంట్లో తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా 14567 నెంబర్ కి ఫోన్ చేయాలని, వికలాంగుల కి ,పింఛన్ సదరం సర్టిఫికెట్ కోసం ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేయాలన్న, టోల్ ఫ్రీ నెంబర్లకి ఫోను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ స్వరూప రాణి అంగన్వాడి టీచర్లు షాహిన్ సుల్తానా ,రిజ్వాన బేగం, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ గౌతమి జెండర్ స్పెషలిస్ట్ హిమ శ్రీ, మైనారిటీ మహిళలు పాల్గొన్నారు

## పద్మశాలిల ఉన్నతికి తోడ్పడింది కొండ లక్ష్మణ్ బాపూజీ.

### - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

సూర్య,రాయికల్

పద్మశాలిల ఉన్నతికి, బీసీల ఐక్యతకు తోడ్పడింది కొండ లక్ష్మణ్ బాపూజీ అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు.రాయికల్ మండలం ఇటిక్యాల లో తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహా ఆవిష్కరణలో జగిత్యాల జిల్లా పద్మశాలి అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్,రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,సర్పంచ్ సామల్ల లావణ్య వేణు,తో కలిసి బిజెపి నాయకురాలు బోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమ సమయంలో చేసిన కృషి ,అతను మంత్రి పదవిని కూడా లేక్కచేయకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపిన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, సర్పంచ్ సామల్ల లావణ్య వేణు,ఎంపీటీసీ కొమ్ముల రాదా అదిరెడ్డి,ఉపసర్పంచ్ శేఖర్,ప్యాక్స్ చైర్మన్ మహిపతి,పద్మశాలి అధ్యక్షుడు బైరి గంగాధర్,పద్మశాలి రాష్ట్ర కార్యదర్శి సురేష్, ప్రధాన కార్యదర్శి సామల్ల మహేష్,ఉపాధ్యక్షుడు అంజయ్య,వివిధ గ్రామాల సర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో దేవాలయ శుద్ధి

సూర్య జగిత్యాల టౌన్



అయోధ్య రామ మందిరం ప్రతిష్ట సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్ లో గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావుతో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ బోగ శ్రావణి దేవాలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ ఈనెల 22వ తారీఖున జరిగే అయోధ్య బాలరాముడు విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవ సందర్భంగా గౌరవనీయులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి పిలుపుమేరకు స్వచ్ఛత అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా మన ప్రాంతంలోని ఆలయాలను శుభ్రపరచుకొని 22వ తేదీ రోజు ఒక పండగ వాతావరణంలా మలుచుకొని ఆరోజు ప్రతి ఇంటిలోనూ దేవాలయాల్లో దీప ప్రమిదలను వెలిగించి శ్రీరామ నామ జపం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, జిల్లా కార్యదర్శి బొడ్డు పెద్ద గంగారం, జగిత్యాల రూరల్ మండలాధ్యక్షుడు నలువాల తిరుపతి, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్, గాదసు రాజేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంటినేని రమేష్, పట్టణ మహిళా మోర్చా నాయకురాలు అభయాంజనేయ స్వామి దేవాలయం ట్రస్టు సభ్యులు పట్టణ జిల్లా పదాధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

సూర్య మేడిపల్లి



మండలకేంద్రంలో గురువారం రోజు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ ర్యాలీలో ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు మహిళలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మేడిపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తన విజయానికి అహర్నిశలు కృషి చేసిన మేడిపల్లి మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి గొప్ప విజయంతో గెలిపించిన మీకు రుణపడి ఉంటానని అన్నాడు.మీరు ఓటువేసి నన్ను ఆశీర్వదిస్తే ప్రభుత్వ పెద్దలు తనకు ప్రభుత్వ విప్ గా మరోమెట్టు ఎక్కించారని అన్నారు.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలలో మొదటగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమల్లోకి వచ్చిందని ఆయన అన్నారు.రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 10లక్షల వరకు అమలు చేశామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా మహిళా సంఘ భవనం మంజూరీ కి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి,బీమరం రెండు మండలాల ప్రెసిడెంటు లు ఏనుగు రమేష్ రెడ్డి,సింగిరెడ్డి నరేష్ రెడ్డి లు మండల అధికార ప్రతినిధి చేపూరీ నాగరాజు,వైస్ ప్రెసిడెంట్ మార్గం నర్సా రెడ్డి, ఎస్ సీ సెల్ ప్రెసిడెంట్ మ్యదరి లాజర్,సీనియర్ నాయకులు దాసరి శంకర్,యూరుమడ్ల నర్సయ్య,గ్రామ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి,మేడిపల్లి మండల సోషల్ మీడియా ఇంచార్జీ,మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయిని గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.




## ఎన్టీఆర్‌కు భారతరత్న బిరుదు ప్రకటించాలి

సూర్య, కోరుట్ల



బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన తెలుగు దేశం వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని, అలాంటి ఎన్టీఆర్ కు భారతరత్న బిరుదును వెంటనే ప్రకటించాలని కోరుట్ల నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేసారు.ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పులమాల వేశారు. ఈ సమావేశంలో దేశం నాయకులు శ్రీనివాస్, రాజ గణేష్, కటకం మహాదేవ్, బాదం మోహన్, బాలే మారుతి, ఎండి దస్తగిరి, ఎండి నజీర్, టి నరహరి, ఎండి ముజాహిద్, ఎండి షకిల్, సురేష్, రాజా, రాహుల్, రామ్, ఉమేష్, రాజీవ్, వినోద్, మల్లేశ్వరి, విజయ, వాణి, దివ్య, మౌనిక పాల్గొన్నారు.

## ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

సూర్య, కోరుట్ల టౌన్



పట్టణంలోని ఆదిత్య హాస్పిటల్ లో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు గురువారం నిర్వహించినట్లు వైద్యులు డాక్టర్ వి వి రంగనాథ్ తెలిపారు. హాస్పిటల్ నిర్వాహకులు, గ్లెన్'మెర్క్ మందుల తయారీ కంపెనీ సంయుక్తంగా ఉచితంగా తినక ముందు, తిన్న తరువాత, మూడు నెలల మధు మేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రంగనాథ్ తెలిపారు.దాదాపు 800 రూపాయల విలువ గల పరీక్షలను ఉచితంగా నిర్వహించి, రోగులకు ఉచితంగా పరీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు దాదాపు వంద మంది వరకు ఉచిత మధుమేహం నిర్ధారణ పరీక్షలను వినియోగింకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, గ్లెన్ మెర్క్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

### - 22 మోటార్లు స్వాదీనం

సూర్య జగిత్యాల



జిల్లాలో వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూరు కు చెందిన చిన్నమనేని మహేష్, బసగుట్ట నవీన్ లను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు తెలిపారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీరి వద్ద 22 మోటార్లు, మోటార్లు విప్పడానికి ఉపయోగించే 5 పానాలు, వైర్లు కత్తిరించడానికి వినియోగించే రెండు కట్టర్లు, ఒక కారు స్వాదీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ వెంకట స్వామి, రూరల్ సీఐ ఆరీఫ్ అలీ ఖాన్, ఎస్ ఐ సదాకర్ లు పాల్గొన్నారు

## తహసిల్దార్ కార్యాలయం ముందు ముగ్గురినీ కరిచిన వీది కుక్కలు

సూర్య కొడిమ్యాల:

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వీది కుక్కలు ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. తహసిల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయం మధ్యలో గురువారం రోజు వీదీ కుక్కల వీరంగం సృష్టించాయి. ముగ్గురి పై దాడి చేశాయి. ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలు అయినా వారి లో ఒకరు రిపోర్టర్ కాగా ఒకరు తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది. సామాన్య పౌరుడు ఉన్నారు. గాయాలు అయినా వారికి కొడిమ్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది చికిత్స చేసారు. నిత్యం మండలం లోని ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు రావడం జరుగతుంది. తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారికి ప్రభుత్వ కార్యాలయాలంలో పని చేస్తున్న సిబ్బంది కి ఈ విధంగా జరగడం బాధకర విశయం అని మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను కొడిమ్యాల మండల ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### - విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచికరమైన భోజనం వడ్డించాలి

### -ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**సూర్య వేములవాడ**

ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలలో పరిశు భ్రత తో పాటు వాటిలో ఉండి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల కు క్వాలిటీ విద్య అందేలా చూడడంతో పాటు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలనీ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురుకులాల ప్రిన్సిపాల్ లు, వసతి గృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాలలోని బాలికల హాస్టల్ ను సందర్శి%శీ%చారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేములవాడలోని మైనార్టీ గురుకుల బాలుర, పాఠశాల, కళాశాల ను పరిశీలించారు. తరగతి, వంట, వసతి గదులు, ఆహార సరుకులను పరిశీలించారు. సరుకుల సరఫరాలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే ఒకే బోరు బావి మీద మూడు పాఠశాలలు ఆధారపడి ఉన్నందున మరో బోరుబావిని మంజూరు చేయాలని చెప్పారు. మిషన్ భగీరథ కనెక్షన్ కూడా ఇవ్వాలన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లేకపోవడం వల్ల ఓవర్లోడ్ తో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రిన్సిపల్ రాజేష్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మెస్ పాడవడం వల్ల విద్యార్థులు దోమకాటు కు



గురవుతున్నారని చెప్పారు. ప్రైవేట్ బిల్డింగ్ లో గురుకులం నిర్వహిస్తున్న దృష్ట్యా భవన యజమాని తో మాట్లాడి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసేలా చూడాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి గంగయ్య కు సూచించారు. దోమల బెడద లేకుండా మెస్ ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మినరల్ వాటర్ ప్లాంట్ ను వారం రోజుల్లోగా పునరుద్ధరించాలని చెప్పారు. వాష్ రూం లకు డోర్ లను వెంటనే బిగించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ రాజేశంను ఆదేశించారు. అక్కడి నుంచి నేరుగా వేములవాడ తిప్పాపూర్ ప్రభుత్వ బాలికల హాస్టల్ ను సందర్శించారు. హాస్టల్ ను ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నామని చాలా నెలల నుంచి అద్దె డబ్బులు రావడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి తీసుకువచ్చారు. ఇక్కడ ఉండే విద్యార్థులు డిప్లొమా కోర్సులు చదువుతున్నారని హాస్టల్ సమీపంలో ఆర్టీసీ బస్సులు అపడం లేదన్నారు. ఈ హాస్టల్ లో 80 మంది విద్యార్థులు ఉంటున్నారని , సరిపడా బెడ్ లు లేక కొద్ది మంది విద్యార్థులు క్రింద పడుకుంటున్నారనీ చెప్పారు. సాధ్యమైనంత త్వరలో 15 కొత్త బెడ్ లను హాస్టల్ కు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. అక్కడి నుంచి వేములవాడ పట్టణంలోని బిసి బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్ లో పడక గదులు, వంట గది , వాష్ రూం లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూవిద్యార్థుల పట్ల కేర్ తీసుకో వాలన్నారు. ఒక్క విద్యార్థి కూడా అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ హాస్టల్ నిర్వాహకులు , ప్రిన్సిపల్ లకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇన్ ఛార్జ్ మైనార్టీ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, స్పెషల్ అధికారి సర్వర్ మియా, ప్రత్యేక అధికారులు జిల్లా పశు సంవర్ధక శాఖా అధికారి కొమురయ్య, రఫీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.




## స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించిన డీపీవో

**సూర్య, సెంటినరీ కాలనీ 02 :**

పెద్దపల్లి-మంథని-రత్నాపూర్ ప్రధాన రహదారిలో జరుగుతున్న శానిటేషన్ పనులను డీపీవో చంద్రమౌళి పరిశీలించారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ పనుల కింద చెత్త, చెదారం తొలగింపు, శానిటేషన్, ఇతర పనులను నిర్వహిస్తు న్నారని ఆయన తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ పనులు జరుగుతున్నాయని తెలిపారు.



## అధికారుల సంఘం సెక్రటరీ పదవికి నామినేషన్

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ అధికారుల సంఘం (సీఎంఓఏ) ఏరియా సెక్రటరీ పదవికి డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్ గౌడ్ బుధవారం నామినేషన్ వేశారు. సింగరేణి సంస్థలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా ఆయన తన నామినేషన్ పత్రాన్ని ఇంచార్జ్ జీఎం నలజాల రాధాకృష్ణ కు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్.వెంకట రమణ, ఓసీపీ-2 ప్రాజెక్ట్ ఆఫీసర్ కుర్మా రాజేందర్, ఎన్విరాన్మెంట్ డీజీఎం డి.వి.సత్యనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ కనవెన. ఐలయ్య, సివిల్ డీజీఎం పీవీఎన్.పద్మరాజు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇనుగల లక్ష్మీనారాయణ, ఫైనాన్స్ మేనేజర్ గడ్డం శ్రావణ్, సేఫ్టీ ఆఫీసర్ ఆసిఫ్ యాసిన్, ఆకుల శ్యామల, టీ. శంకర్,అదికారులు కన్నా.కిషన్, కే.కిషన్, రాజేష్,జయకర్, జీ. ఎల్ .రాజు ఉన్నారు. ఆర్జీ-2 అధికారుల సంఘం బ్రాంచ్ సెక్రటరీ పదవికి ఓసీపీ-3 సీనియర్ సర్వే అధికారి దీటి చంద్రమౌళి నామినేషన్ వేశారు. తన నామినేషన్ పత్రాన్ని ఆర్జీ-2 జీఎం ఎల్.వి.సూర్యనారాయణ కు అందించారు. ఆర్జీ-1 అధికారు లు సంఘం జనరల్ సెక్రటరీ పదవికి సివిల్ ఎస్ఈ పూస వసంత కుమార్ నామినేషన్ వేశారు. తన నామినేషన్ పత్రాన్ని జీఎం చింతల శ్రీనివాస్ కు అందచేశారు. ఆయన వెంట సివిల్ డీజీఎం పల్లెర్ల నాగేశ్వరరావు ఉన్నారు.

## ఇటుక బట్టీల నిర్వహణ అనుమతులపై విచారణ

**సూర్య-పెద్దపల్లి రూరల్**



ఇటుక బట్టీలను అనుమ తులు లేకుండా నిర్వహిస్తున్నారని లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో గురువారం పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ శాఖ అధికారులు మండలంలోని, రాఘవపూర్ గౌరెడ్డిపేట గ్రామాల్లో ని పలు ఇటుక బట్టీలను పరిశీలించి విచారణ చేపట్టారు. ఇటుక బట్టీల నిర్వహణ, అనుమతులు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, భూముల వివరాలు తదితర వాటిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ రాయల్టీ ఇన్స్పెక్టర్ పరశురాం డిఎల్పీఓ వేణుగోపాల్ ,ఎంపీ ఓ సుదర్శన్ , ఆర్ఐ ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన అసం శంకర్(38) మృతి చెందగా వారి కుటుంబానికి సర్పంచ్ గంట పద్మ వెంకటరమణ రెడ్డి రూ.5000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడు ఆసం శంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని, అలాగే వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరారు. మృతిని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలియచేసారు.

# ఆలయ పరిసరాలు పరిశుభ్రం

**సూర్య-పెద్దపల్లి రూరల్**

శ్రీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దబొంకూర్ గ్రామంలోని శ్రీ చెన్నకేవస్వామి మరియు హనుమాన్ టెంపుల్ సన్నిధిలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అయోధ్య లో శ్రీరాముని విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఉన్నందున అయోధ్యలో కొలువు కాబోతున్న శ్రీరాముడిని స్మరిస్తూ పెద్ద బొంకూర్ లో కొలువైన శ్రీ చెన్నకేశవ స్వామి సన్నిధానంలో పూజా కార్యక్రమాలు, భజనలు నిర్వహించనున్నట్లు



ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మెన్ మిట్టపల్లి శ్రీనివాస్ గారు, అయ్యగారు తిరుకోవల్లూరి శ్రీనివాస మూర్తి గారు, సీపెల్లి శ్రీనివాస్, దామరకుంట శ్రీనివాస్. కలవేన రవి, పిల్లలమర్రి అశోక్,మడుపు కృష్ణమాచారి, కొత్తూరి సదానందం, బైరి శ్రావణ్, అబ్బోజు సత్యనారాయణ, పవన్ కళ్యాణ్, గైని దివిన్, కారుపాకల జ%శీ%పయ్య, అనిల్, కొత్తూరి రమేష్, బాలు, రవిశాస్త్రి , సురేష్,నాగరాజు,సంపత్,రాజు, పొగాకు సదానందం,అరుణ్,శ్రీను, రాకేశ్, కల్వల తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు...

# కష్టపడిన వారికి కాంగ్రెస్ లో తగిన గుర్తింపు

### - పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చాటాలి - కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్

**సూర్య, జమ్మికుంట రూరల్**

కష్టపడిన వారికి కాంగ్రెస్ లో తగిన గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. జమ్మికుంట మండల%శీ%లోని వెంకటేశ్వరపల్లి గ్రామంలోని వెంకటేశ్వర గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటుందని, కలిసికట్టుగా పనిచేయాలని సీనియర్లు, నాయకుల సలహాలు సూచనలు తప్పకుండా పాటించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తవారిని తయారు చేయాలని గ్రూపు రాజకీయాలు చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పైరవులు పనిచేయవని, కష్టపడితేనే పదవులు వస్తాయని, పిసిసి ఒక సర్వే చేపిస్తుందని, కష్టపడి నాయకులను గుర్తిస్తారని, వారికే పదవులు వస్తాయని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, కాంగ్రెస్ పార్టీకి ప్రధాన పోటీగా బిజెపి పార్టీ ఉంటుందని, ఇప్పటికే ఆ పార్టీ వాళ్లు అయోధ్య



అని, రాముని అక్షింతలంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి తగిన పదవులు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో బుత్ స్థాయి కమిటీ నుండి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా ఉండి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించేలా ఇప్పటి నుండే కార్యదీక్ష కు పోనుకొని ముందుకు కొనసాగాలని ఆయన కోరారు. పార్టీలోకి కొత్తవారు కూడా వస్తారని అందరం కలుపుకొని పోయి కాంగ్రెస్ పార్టీ కొరకు చేయాల్సి వస్తుందని వర్గ విభేదాలతో పార్టీని నష్టపరచవద్దని అలాంటి వారు ఉంటే కాంగ్రెస్ పార్టీ నుండి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామపంచాయతీ నుండి అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు గెలుపు కొరకు పనిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలు ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని పార్టీలకు అతీతంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ కొరకు ప్రతి ఒక్కరు కష్టపడతామని గత ఎన్నికల్లో నేర్చుకున్న గుణపాఠంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామని, పార్టీలో కష్టపడ్డవారిని గుర్తించాలని నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుల్లురి సదానందం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆరుకాల వీరేశలింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడేపు సారంగపాణి, మొలుగురి సదానందంతో పాటు సీనియర్ నాయకులు రాచపల్లి రమేష్, పింగిలి రాకేష్, వీరమనేని పరశురాం రావు, పర్లపెల్లి నాగరాజు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసిఆర్, బిఆర్ఎస్ మీద కోపాన్ని రైతులపై చూపించకండి

**- రైతులకు సరిపడా నీళ్లు అందించండి - దళిత బంధు రెండో విడత వెంటనే విడుదల చేయాలి -హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**సూర్య, వీణవంక**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ తో పాటు బిఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ ప్రభుత్వం తన అక్కస్సును వెళ్లగక్కుతుందని, తమపై కోపంతో రైతులకు నీళ్లు ఇవ్వకుండా కేసిఆర్ ను బదనాం చేసే ప్రయత్నం చేయవద్దని హుజురాబాద్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం వీణవంకలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పది సంవత్సరాలు రైతులకు చిన్న సమస్య రాకుండా చూసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజులు గడవక ముందే రైతులకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ఇప్పటికే నాట్లు వేసుకొని ఎదురుచూస్తున్న రైతులకు పూర్తిస్థాయి లో నీళ్లు కూడా ప్రభుత్వం అందించలేక పోతుందని అన్నారు. పొలాలు, వాగుల దగ్గరకు వెళ్లి చూస్తే మొత్తం పర్రెలే కనిపిస్తున్నాయని అన్నారు. గత పది సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు కనిపిస్తున్నాయని అన్నారు. మార్పు రావాలి... మార్పు తేవాలి అని చెప్పింది ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. రైతుల కోసం



ఇప్పటికే అనేక పర్యాయాలు ఇరిగేషన్ ఎస్సీతో మాట్లాడాలని అన్నారు. వీణవంకలోని బిఆర్ఎస్ నాయకులతో పాటు రైతులు ఇటీవలే కల్వల ప్రాజెక్ట్ వద్దకు కూడా వెళ్లారని, అక్కడ కొద్దిపాటి నీళ్ళు మాత్రమే వస్తున్నాయని, పూర్తిస్థాయిలో నీళు వస్తేనే వ్యవసాయానికి అనుగుణంగా ఉంటుందని ఆయన అన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు అందించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల హామీలో భాగంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎకరానికి 15000 ఇస్తానని స్వయంగా ముఖ్యమంత్రి అన్నారని, అయిన ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. వెంటనే రైతులందరికీ ఎకరానికి 15000 చొప్పున రైతుబంధు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే దళితుల అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టుగా హుజురాబాద్ లో అమలు చేసిన దళిత బంధు కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని 18 వేల కుటుంబాలకు దళిత బంధు అందించామని అన్నారు. రెండో విడతలో భాగంగా ఇప్పటికీ 1500 నుంచి 2000 కుటుంబాలకు వారి ఎకౌంట్ లో డబ్బులు జమ అయి ఉన్నాయని, వాటిని బ్యాంకు వారు ఫ్రిజ్ చేశారని, వెంటనే వాటిని దళిత కుటుంబాలకు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీణవంకలోని రోడ్డు కోసం గతంలోని 30 కోట్లతో మంజూరు చేశామని, శుక్రవారం పర్యవేక్షించి బీటీ కూడా వేయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రేణుక తిరుపతి రెడ్డి, సర్పంచ్ నీల కుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి మహేష్, వైస్ ఎంపీపీ లత శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి రాజ మల్లయ్య, నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**పాత్రికేయుడు కొండాల్ కి అండగా ఉంటాను....**

వీణవంక రిపోర్టర్ పత్తి కొండాల్ రెడ్డి పక్షవాతంతో బాధపడుతుండగా గురువారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆయనను పరామర్శించారు. కొండాల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు.

## కళాశ్రీ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాలకు చెందిన కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు రూపొందించిన 2024 నూతన సంవత్సర సాయి క్యాలెండర్ ను గురువారం జగిత్యాలలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు సౌమిత్రి వేణుమాధవా చార్య స్వహస్తల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండేటి రాజును ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, వ్యాపారవేత్త చెట్ల చంద్రశేఖర్, పంజాల తిరుపతి గౌడ్, వడ్లకొండ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**సూర్య జగిత్యాల**



జగిత్యాల జిల్లా కేంద్రంలో గల తెలంగాణ మైనారిటీ జూనియర్ కళాశాల లో 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మహేందర్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరములో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల లో మొత్తముగాను 80 సీట్లు కలవని, ఆన్లైన్లో గాని లేదా కళాశాలలో నేరుగా సంప్రదించి, అడ్మిషన్ చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనారిటీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలియజేశారు. అడ్మిషన్లు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 6 అని తెలియజేశారు. ఆన్లైన్లో https://www.tmreis.telangana.gov.in% ద్వారా అడ్మిషన్ చేసుకోవచ్చు అని తెలిపారు.

## ఒడ్డెర కాలనీలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

**సూర్య జగిత్యాల**



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ దరూర్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం జగిత్యాల రూరల్ మండలం వడ్డెర కాలనీ గ్రామం లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బ్యాంకులో ఉన్న ఇన్సూరెన్స్ ల గురించి రుణాల గురించి, డిజిటల్ లావాదేవీల గురించి విభూది బ్రదర్స్ కళాజాత వారు మ్యాజిక్ షో ద్వారా చక్కగా పాటల ద్వారా, మాటల ద్వారా గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులు బ్రాంచ్ మేనేజర్ మసూద్, గ్రామ సర్పంచ్ రాజమణి గంగాధర్, ఉప సర్పంచ్ నాగవ్వ లక్ష్మణ్ ,ఎపియం వి.గంగాధర్,సి. సి. పి.గంగారాం, వి.ఓ.ఏ మమత, కళాజాత సభ్యులు రవి వెంకటేష్,మహిళ సంఘాల సభ్యులు, ఖాతా దారులు తదితరులు పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం

**సూర్య,రాయికల్**



రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో 250మందికీ కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 120 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించడం జరిగిందని క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్.సి.కాటి పెల్లి రామ్ రెడ్డి,డీసీ బత్తిని భూమయ్య,అధ్యక్షులు కొమ్ముల ఆది రెడ్డి,కార్యదర్శి మోసారపు శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్,ఆర్.ఎం.పి లు సుమన్,శ్రీనివాస్,లయన్స్ సభ్యులు ఎద్దండి దివాకర్ రెడ్డి,కడకుంట్ల నరేష్,పారిపెల్లి శ్రీనివాస్, సామల్ల గోపాల్,బొమ్మ కంటి నవీన్,కనపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయపు పన్ను రద్దుకు పెన్షనర్ల పోస్ట్ కార్డులఉద్యమం

**5 సూర్య జగిత్యాల**

కేంద్రప్రభుత్వం పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు.గురువారం పదవీ విరమణ చేసిన ఉద్యోగులను,ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు కోరుతూ తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్,మండల శాఖల తమ పెన్షనర్స్ అసోసియేషన్ ల ప్రతినిధులు జగిత్యాల జిల్లా కేంద్రంలో సమావేశమై ప్రధాన మంత్రికి పోస్ట్ కార్డులపై వినతులు రాసి ధరూర్ క్యాంపు లో ఉన్న పోస్ట్ అఫిసుకు వెళ్లి పోస్టల్ డబ్బాలో పోస్ట్ కార్డులు వేశారు. ,ప్రత్యేకంగా ప్రధాన మంత్రికి,కేంద్ర ఆర్థికమంత్రికి రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖలు పంపారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గత ఏడు ఏళ్లుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోకుండా ఉండడం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఫిబ్రవరి 1 న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప 2024-25 ఆర్థిక సంవత్సరం నకు ప్రవేశ పెట్టె బడ్జెట్ లో పెన్షనర్ల కు ఆదాయపు పన్ను మినహాయింపు కు చర్యలు తీసుకొని పక్షంలో ఫిబ్రవరి చివరి వారంలో మళ్లీ ఢిల్లీ వెళ్లి తమ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో ధర్నాలు చేసి రాష్ట్ర ఎంపీలను,కేంద్ర మంత్రులను కలిసి తమ డిమాండ్ ను పార్లమెం ట్ లో వినిపించాలని కోరుతామన్నారు.35 ఏళ్లు ప్రభుత్వంకు, ప్రజలకు సేవలందించిన పెన్షనర్స్ కు ఇచ్చే గౌరవభృతి పై ఆదాయపు పన్ను వసూలు చేయడం సరికాదన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తమ అస్సోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కోరామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహా అధ్యక్షుడు పి.హన్మంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు వి.ప్రకాశ్ రావు,ఎం.డి.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల అశోక్ రావు, సత్యనారాయణ,, మహిళా కార్యదర్శి బోబ్బాటి కరుణ, జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్, కోరుట్ల అధ్యక్షు డు పబ్బా శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, ఉపాధ్య క్షుడు సైఫోద్దీన్, మల్యాల అధ్యక్షుడుఎం.డి.యాకూబ్,ధర్మపురి అధ్య క్షుడు కే.గంగా దర్, కార్యదర్శి గంగ రెడ్డి, మెట్ పల్లి అధ్యక్షుడు గంగాధర్, కార్యద ర్శి రాయల్, నాయకులు దేవేందర్ రావు, భీమయ్య, నారాయణ, మధుసూ దన్ రావు, సయ్యద్ యూసుఫ్, మురళీదర్, ప్రసాద్, శ్రీనివాస్, హన్మాండ్లు, ఎం.డి.ఎక్బాల్, నర్సయ్య, జిల్లా, డివిజన్ మండలాల యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.





## నా గెలుపులో భాగస్వామ్యమైన వారి రుణం తీర్చుకుంటా

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ నియోజకవర్గంలో నా గెలుపు కోసం భాగస్వామ్యమైన వారి రుణం తీర్చుకుంటానని హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో హుజురాబాద్ నియోజకవర్గంలోని సర్పంచులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నా గెలుపు కోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల సర్పంచులు కృషి చేశారని అన్నారు. వారి కృషి ఫలితంగా నా విజయం సాధ్యమైందని అన్నారు. నాకోసం కష్టపడిన వారు ఎవరిని మర్చిపోనని, వచ్చే పంచాయతీరాజ్ ఎన్నికల్లో వారిని గెలిపించుకొని వారి రుణం తీర్చుకుం టానని అన్నారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన పెంచుకొని అసెంబ్లీలో వాటి సాధన కోసం గట్టిగా కొట్లాడుతానని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం చేయని అధికారుల వద్ద కు కూడా మీ వెంట ఉండి వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కమలాపూర్ మండలాల 93 మంది సర్పంచులను ఆయన శాలువాతో, మెమెంటో తో ఘనంగా సత్కరించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్ పర్సన్ కనుమల్ల విజయ, హుజురాబాద్ జడ్పిటిసి పడిదం బక్కారెడ్డి, బాల కిషన్ రావు, కౌన్సిలర్ రమాదేవి, కుమారస్వామి, ముత్యం రాజు, తిరుమల్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ఎంపీపీ మమత, నాయకులు గందె శ్రీనివాస్, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, వడ్లూరి విజయ్ కుమార్, పింగిలి రమేష్, తిరుపతిరావు, మాజీ మార్కెట్ చైర్మన్ పొల్నేని సత్యనారాయణ రావు, ఇంద్రసేనారెడ్డి, లత, తిరుపతి రావు, అశోక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## బల్మూర్ వెంకట్ కు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

**సూర్య జమ్మికుంట**

ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బల్మూర్ వెంకట్ గురువారం ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అసెంబ్లీ లో నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శుభాకాం క్షలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వం రావు జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న బల్మూర్ వెంకట్ స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ సలీం పాష, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ కోఆర్డి నేటర్ చిన్నింటి నాగేంద్ర,వొల్లాల శ్రీనివాస్, మాధవరావు, లింగారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మోడల్ స్కూల్ ఘన్ముకులలో ప్రవేశాలకు నోటిఫికేషన్

**సూర్య, వీణవంక**

తెలంగాణ మోడల్ స్కూల్ వీణవంకలోని ఘన్ముకుల 2024 - 25 వ సంవత్సరానికి 6 వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నవని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటన లో తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 22 ఫిబ్రవరి 2024 న 6 వ తరగతితో పాటు 7 నుండి 10 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్ సైట్ telanganams.cgg.gov.in. స్థానిక మీ సేవా కేంద్రాలు లేదా ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకొవచ్చునని, ఓసి విద్యార్థులకు 200 రూపాయలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పి.హెచ్.సి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 125 రూపాయలు, 6 వ తరగతి విద్యార్థులకు పరీక్ష 07.04.2024 న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, 7 నుండి 10 వ తరగతి విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించబడునని, మిగిలిన వివరాలు సంబంధిత వెబ్ సైట్ లో చూడగలరని పేర్కొన్నారు.

# గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వాళ్లనే వస్త్ర పరిశ్రమ బంద్

**- పవర్లుమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

గత ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడ మే పరిశ్రమ బందుకు కారణమని పవర్లుమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు గత 3 రోజుల నుండి పరిశ్రమలను బంద్ చేయడం వలన పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు పని లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఆయన వాపోయారు. గురువారం పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ , రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ , జిల్లా అధ్యక్షులు కోడం రమణ , నాయకులు సిరిమల్ల సత్యం , ఆడెపు సంపత్ తదితరులు సిరిసిల్ల పట్టణంలోని కార్మిక క్షేత్రమైన బి.వై. నగర్ లోని పరిశ్రమలను సందర్శించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా



కూరపాటి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. కార్మికులకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేసి ప్రభుత్వ ఆర్డర్లు వారితో ఉత్పత్తి చేసి ఉంటే కార్మికులు యజమానులపై ఆధారపడి బతుకువలసిన పరిస్థితి ఉండేది కాదని అన్నారు. యజమానుల ప్రయోజనం కొరకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని మంత్రి కేటీఆర్ పూర్తి చెయ్యలేదన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పాలిస్టర్ , కాటన్ మార్కెట్ మొత్తం సిరిసిల్ల నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం జరిగిందని, ప్రస్తుతం మార్కెట్ లేక పాలిస్టర్ వస్త్రం యజమాలు ఉత్పత్తి చేయలేమంటున్నారని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వంలో రావలసిన బతుకమ్మ చీరల బకాయి బిల్లులు , కరెంటు అధిక చార్జీల సమస్యలు కూడా పాలిస్టర్ పరిశ్రమ బందుకు తోడైనాయని వెల్లడించారు. ఈ పరిస్థితి రావడానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. యజమానులు ప్రభుత్వ ఆర్డర్లు ఉన్నంతకాలం లాభాలు వచ్చినంత కాలం కార్మికులతో పని చేయించుకుని ప్రభుత్వాలు ఆర్డర్లు అయిపోగానే కొత్త ప్రభుత్వం మళ్లీ బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తదో ఇవ్వదో అని పరిశ్రమలను బందు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.వెంటనే ప్రభుత్వం యజమానులు పెట్టిన బందును ఉపసంహరించుకునే విధంగా చర్యలు తీసుకొని కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.




## నేషనల్ యూత్ వీక్ సెలబ్రేషన్స్‌లో వాలీబాల్ పోటీలు..

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలం తడగొండ పాఠశాలలో నేషనల్ యూత్ వీక్ సెలబ్రేషన్స్ లో భాగంగా వాలీబాల్ పోటీలను నిర్వహించరు. ఇట్టి పోటీలలో 8 టీంలు పాల్గొన్నాయి.మొదటి విజేతగా మోహన్ టీం,రెండవ విజేత వెంకటేష్ టీం, మూడవ విజేత నిఖిల్ టీములు గెలుపొందారు. నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ సాయి వరప్రసాద్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.



## నూతన ఎస్పైని కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సూర్య బోయినపల్లి**

బోయినపల్లి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న శ్రీకాంత్ నాయక్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,మాజి జడ్పీటీసీ పులి లక్ష్మి పతి గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కనుకయ్య ,తడగొండ ఎంపీటీసీ ఉయ్యాలా శ్రీనివాస్ గౌడ్ ,మండల కాంగ్రెస్ నాయకులు బోయిని ఎల్లేష్ ,రాజ్య లక్ష్మి, జాంగం అంజయ్య ,ఎండీ బాబు,అనుముల హరికృష్ణ, పెండ్లి నాగరాజు,ఎండీ హుస్సేన్, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, గంగిపెల్లి లచ్చయ్య,నల్ల మోహన్ ,కొండం మల్లయ్య,మహేందర్, కన్నం రాజు, బోయిని మల్లేశం, ముదం శ్రీనివాస్,నేరెళ్ల అంజయ్య, ఎండీ రఫీ, సంపత్, మాధవ రెడ్డి, బాబు, లాల్ కనుకయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు నాగుల వంశీ గౌడ్, నిమ్మ వినోద్ రెడ్డి, గుంటి జెలెందర్, గోపి,అజాయ్, రత్నాకర్ రెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులకు నిధులు ఇవ్వనిదే బిఆర్ఎస్ సర్కార్

**- ఇసుక మాఫియాలో నెలకు కోటి రూపాయల అవినీతి**

**-పోలీసులు బిఆర్ఎస్ పార్టీ తోత్తుల్లా పనిచేశారు**

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి మృత్యుంజయం**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



రాష్ట్రంలో సర్పంచులకు నిధులు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేసింది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి మృత్యుంజయం అన్నారు.గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మొన్నటికి మొన్న కేటీఆర్ సర్పంచులకు సన్మానం చేశారని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. చేసిన పనులకు బిల్లులు రాక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 45 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ ఫైనాన్స్ నిధులను మళ్లించారని మండిపడ్డారు. పోలీసులు బిఆర్ఎస్ పార్టీ తోత్తుల్లా పనిచేసి ఇసుక మాఫియాలో నెలకు యాభై లక్షల నుంచి కోటి రూపాయల అవినీతి చేశారని మృత్యుంజయం ఆరోపించారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేనివిధంగా సిరిసిల్లలో అత్యధికంగా బెల్టు షాపులు ఉన్నాయని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ అండతో తన అనుచరులు ఇసుక మాఫియా తెరలేపారని, పది సంవత్సరాల నుండి అక్రమ ఇసుక రవాణ జరుగుందని, పోలీసులు లంచాలు తీసుకొని ఇసుక మాఫియాకు సహకరించారని, తన దగ్గర ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు నేరళ్ల దళితులకుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, వారికి ఇంతవరకు న్యాయం జరగలేదని గుర్తు చేశారు. ఇసుక మాఫియా పై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, కమలాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు.

**సూర్య రాజన్న సిరిసిల్ల**



మాధకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం ద్వారా కలిగే అనర్థాల పట్ల యువతలో అవగాహన పెంపొందించడం కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులను 3 కేటగిరీలుగా విభజించి మాధకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలు, అవగాహనపై ఆయా పాఠశాల్లో, కళాశాలల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రెండవ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒక కేటగిరి, ఆరు నుండి పదవ తరగతి వరకు రెండవ కేటగిరి, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ విద్యార్థులు మూడవ కేటగిరీగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మండలాల వారీగా ఎంపిక చేసి వారికి జిల్లా స్థాయిలో ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యను పరిష్కరించాలి

**చందుర్తి**

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అన్నారు, చందుర్తి మండల కేంద్రంలో మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు పెంచాలని గురువారం నిరసన తెలిపారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేస్తున్నారని వారి సమస్యను పరిష్కరించాలన్నారు, కోడిగుడ్డుకు ప్రభుత్వం ఐదు రూపాయలు చెల్లించగా మార్కెట్లో కోడిగుడ్డు ధర ఏడు రూపాయలు ఉందన్నారు, కావున కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలన్నారు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 4వ తేదీన సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుండి పద్మశాలి కళ్యాణ భవనం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు తరలిరావాలన్నారు, ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మద్రి విజయ, లింగంపల్లి లక్ష్మి, పెరక రేణుక,పిట్టల లక్ష్మి, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై కాంగ్రెస్ పార్టీ ముసలి కన్నీరు

**- టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడూరు ప్రవీణ్**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ముసలి కన్నీరు కారుస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ పవర్లూమ్ అండ్ టెక్స్టైల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు ప్రవీణ్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల పవర్ లూమ్ కార్మికులకు టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ చేసినంత మేలు ఎవరూ చేయలేదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆర్డర్లతోపాటు బతుకమ్మ చీరల పథకం ప్రవేశపెట్టి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం సంక్షోభంపై మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు నేత కార్మికుల అభ్యున్నతికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము బతుకమ్మ చీరల బిల్లులు చెల్లించలేదని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ వారే అని గుర్తించాలని, పరిశ్రమ యజమానులకు బిల్లులు చెల్లించి మాట్లాడితే బాగుండేదని అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖలో మెగా పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కోరడాన్ని తీవ్రంగా దుయ్యబట్టిన గూడూరి ప్రవీణ్ గతంలో మంత్రి కేటీఆర్ ఎన్నోసార్లు పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు అన్న విషయం గుర్తు చేశారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా రిజిస్ట్రార్

**సూర్య వేములవాడ టౌన్**



వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని గురువారం ఉమ్మడి కరీంనగర్ నూతన జిల్లా రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్ వేములవాడ రాజన్నను దర్శించుకొని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చే ప్రతి వినియోగదారునికి అందించే సేవల్లో ఎలాంటి లోపం ఉండొద్దని, వినియోదారులకు అందించే సేవల వివరాలను స్థానిక సబ్ రిజిస్టర్ ను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా రిజిస్టర్ కార్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సబ్ రిజిస్టర్ కు సూచించారు. కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఆయన వెంట స్థానిక సబ్ రిజిస్టర్ చెర్ల సురేంద్రబాబు, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు..

## రాజన్న సేవలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి

**సూర్య వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం కేంద్ర ప్రభుత్వ పీఆర్ఆర్డి అదనపు కమిషనర్ సీపీ రెడ్డి ప్రత్యేక పూజలు మొక్కులు చెల్లించుకున్నారు . మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి,తీర్థ ప్రసాదాలను అందజేశారు ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు సంకపెల్లి పవన్ డిఆర్డీఓ శ్రీనివాస్ లు ఉన్నారు.



# నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంది

## - మొదటి టెక్స్టైల్ పార్కును తెచ్చింది కాంగ్రెస్ - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సూర్య వేములవాడ**



నేతన్నలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వస్త్ర పరిశ్రమపై లేఖ రాయడాన్ని తీవ్రంగా తప్పుపడు తూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. 2004 సిరిసిల్లలో టెక్స్టైల్ పార్క్ తీసుకొచ్చి పరిశ్రమలు నెలకొల్పే విధంగా చేసి వస్త్ర పరిశ్రమలు అభివృద్ధిపరి చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. 2004కు తెలుగుదేశం పార్టీ నిర్లక్ష్యంతో అనేక మంది నేత కార్మికుకు ఆత్మహత్యలు చేసుకున్నా రని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్ప డిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నేత కార్మికుల ఆత్మహత్యలను గుర్తించి సిరిసిల్లకు ప్రత్యేకమైనటువంటి ప్యాకేజ్ అందిం చారన్నారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కు 1,50,000 ఎక్స్ గ్రేషియా,50 సంవత్సరాలకే నేతన్నకు పెన్షన్, 50% పవర్ సబ్సిడి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. సిరిసిల్లకు ప్రత్యేకమైన ప్యాకేజ్ ద్వారా మహిళా గ్రూపులకు 5 లక్షల వడ్డీ లేని రుణాలు, రాజీవ్ విద్యా మిషన్ ద్వారా వస్త్రాన్ని తయారుచేసే ఆర్డర్ ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చిందన్నారు. మరో నాలుగు మాసాల్లో పదవి కోల్పోతున్న ఎంపీ బండి సంజయ్ కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా వస్త్ర పరిశ్రమకు సహకారం చెయ్యలేదన్నారు. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బండి సంజయ్ లేఖ ఉంద న్నారు. సిరిసిల్ల నేతన్నల కోసం 13 వేల అంత్యోదయ కార్డులను అందజేయడమే కాకుండా రాజీవ్ విద్యా మిషన్ ద్వారా పాలిస్టర్ పరిశ్రమ ఏర్పాటు కృషి చేశామన్నారు. గత ప్రభుత్వం చెల్లించని బిల్లులను కూడా చెల్లిం చేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే బిజెపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 20 వేల మంది కార్మికులు ఉన్న ఈ ప్రాంతం నుండి వినోద్ కుమార్, బండి సంజయ్ కలిసి కాకతీయ టెక్స్ టైల్ వరంగల్ కు తరలిం చారని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో నేతన్నలపై భారము మోపుతున్నారని అన్నారు. ఎంపీగా రాష్ట్ర అధ్యక్షుడిగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి సంజయ్ ఎందుకు జీఎస్టీని తొలగించేందుకు నిబద్ధతతో లేడ న్నారు. 45 రోజులు కూడా గడవని ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీజేపీకి చాతనైతే వస్త్ర పరిశ్రమ మీద ఉన్న జీఎస్టీని వెంటనే తొలగిం చాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది రేవంత్ రెడ్డి పాదయాత్ర లోనే నేత న్నాలతో మాట్లాడారని అన్నారు. ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ నాయకులు చిలుక రమేష్ కనికరపు రాకేష్, వస్తాది కృష్ణ గౌడ్, పులి రాంబాబు, వంగల శ్రీనువాస్, ముంజ ఉమేందర్, ముప్పిడి శ్రీధర్, చిలివేరి శ్రీనివాస్ గౌడ్, ఎర్ర శ్రావణ్, రెగ్జిన్ శ్రీనివాస్, జమున, సాయి తదితరులు ఉన్నారు.

# రాజన్న ఆలయంలో రామపాదుకల పూజలు

**సూర్య వేములవాడ**



అయోధ్య రామ మందిరంలో పూజలు చేసిన స్వామి వారి పాదుకలు వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చాయి. ఈనెల 7వ తేదీన అయోధ్యలోని శ్రీ రాములవారి సన్నిధానంలో (బాల రాముని)వద్ద ఈ పాదుకలకు పూజలు నిర్వహించారు. సరయు నదిలో అభిషేకించి, పాదుకలను 20 మంది తలపై పెట్టుకుని కాలినడకన 17వ తేదీ వరకు కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆలయానికి బలమైన సంకల్పంతో చేరుకున్నామని శ్రీ చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకులు శ్రీ సురేష్ ఆత్మరామ్ మహారాజ్ రామదాసి గారు అన్నారు. గురువారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధానానికి అయోధ్య రాముల సన్నిధిలో పూజలు నిర్వహించిన పాదుకలు రావడంతో... రాజన్నల అధికారులు అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్విఘ్నంగా ఏడవ తేదీ నుంచి 17వ తేదీ వరకు కాలినడకన పాదుకలను 20 మంది తలపై పెట్టుకుని వస్తున్నామని అన్నారు. దేశాన్ని ధర్మాన్ని వచ్చే తేరానికి అందించాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని, 14 పాదుకలు తీసుకురావడం జరిగిందని, రామరాజ్యం రావాలనే సంకల్పంతో ఈ పాదుకలు.. 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో స్వామివారి ప్రతిష్ట రోజునే ఈ పాదుకుల ప్రతిష్టాపన జరుగుతుందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సురేష్ ఆత్మరామ్ మహారాజ్ రామదాసీ గారు చెప్పారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు ఆలయ ఇన్స్పెక్టర్ అశోక్ అర్చకులు ఉన్నారు.



# ఓటరు నమోదు కై విస్తృత ప్రచారం

## - జనవరి 22 వరకు నమోదు అవకాశం
## - జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ఓటర్ నమోదు కార్యక్రమం పై గ్రామ పంచాయతీ, మునిసిపల్ ప్రాంతాలలో మైక్ ద్వారా ఓటు హక్కు నమోదు పై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఇరవై రెండు వరకు ఓటరుగా పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఓటు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల దగ్గర చూసుకోవాలని, ఓటర్ లిస్టులో పేరు లేని వాళ్ళు జనవరి ఒకటి, జులై ఒకటి, అక్టోబర్ ఒకటి, 2024 నాటికీ పద్దెనిమిది సంవత్సరాల వయసు నిండే వాళ్ళు కూడా అడ్వాన్స్ గా ఫారం ఆరు ద్వారా ఓటర్లు గా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ లిస్టులో పేరు ఉండి చనిపోయిన వారి వివరాలు ఫారం ఏడు లో పూర్తి సమాచారంతో తొలగించాలని తెలియజేసారు. ఫారం ఎనిమిది ద్వారా పేరు సరి చేయడము, ఫోటో సరి చేయడం, పోలింగ్ స్టేషన్ మారడము, అసెంబ్లీ మారడము,లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫామ్ ఎనిమిది ద్వారా వికలాంగుల ఓటర్లకు సంబంధించి వారి వివరాలు,ఎనభై సంవత్సరాలు దాటి నడవలేని స్థితిలో ఉన్న వాళ్ళు బి ఎల్ ఒ ల ద్వారా ఫ్లాగ్ చేయవలసిందిగా ప్రజలందరికీ అవగాహన కల్పించవలసిందిగా సూచించారు. ప్రత్యేక ఓటరుగా నమోదు కార్యక్రమం క్రింద వచ్చే శనివారం, ఆదివారం అనగా జనవరి ఇరవై, జనవరి, ఇరవై ఒకటి తేదీలలో అన్ని పోలింగ్ స్టేషన్ లలో బూత్ లెవల్ అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందు బాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రధానంగా వికలాంగుల ఓటర్లు, నడవలేని పెద్ద వారు ఎనభై సంవత్సరాలు దాటిన ఓటర్లు ని తప్పనిసరిగా ఫామ్ ఎనిమిది ద్వారా ఫ్లాగ్ చెయ్యడం కోసం వివరాలు తీసుకొని, యాప్ నందు నమోదు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.

# కేజీ వీల్ ట్రాక్టర్ డీ కొని బాలుని మృతి

**సూర్య బీర్పూర్**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం చిత్రవేణి గూడెంలో గురువారం కేజీ వీల్ ట్రాక్టర్ డీ కొని చిక్రం కార్తీక్(10) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో మిశ్రం సురేందర్ కు చెందిన ట్రాక్టర్ ను అతని కొడుకు శివాజీ నడుపుకుంటూ వెళ్తు రోడ్డు ప్రక్కన సైకిల్ పెట్టుకుని నిలబడి ఉన్న కార్తీక్ ను డీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో చిక్రం రవి- జారు భాయ్ దంపతుల నడిపి కుమారుడైన కార్తీక్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా గ్రామంలో విశాధ చాయలు అలుముకున్నాయి.

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలనే వేద పారాయణాలు

## - హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి

**సూర్య ధర్మపురి:**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీ ప్రేమికవరద వేద పరిపాలన సభ హైదరాబాద్ వారి నేతృత్వంలో వేద పారాయణం వేద హవన కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.



ఈ నెల 18 నుండి 24 వరకు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శ్రీ మఠం మఠాధిపతి పర్యవేక్షణలో 21 మంది వేదపండితులచే నిర్వహించనున్న సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణాలు, సంపూర్ణ ఋగ్వేద హవనం సంపూర్ణ సామవేద పారాయణం, కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం గణపతి పూజ, పుణ్య హావచనము, అంకురార్పణ, ఋత్విగ్వరణ, దీక్షధారణ తదితర కార్యక్రమాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పెంపొందాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ



కార్యక్రమం చే. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంగనభట్ల సంగనబట్ల దినేష్, దేవస్థాన ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరిండెంట్ ద్యావల్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, రెనరేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామన్న, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ

## - బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యంశంగా చేర్చాలి - కరీంనగర్ పట్టభద్రుడు ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి

**సూర్య, రాయికల్**

తెలంగాణ స్వాతంత్ర ఉద్యమంలో అలుపె రుగని పోరాటం చేసిన మహాయోధుడు తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ అని బాపూజీ యొక్క జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి అన్నారు.రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పద్మశాలి సేవా సంఘ నాయకులతో కలిసి ఆవిష్క రించారు. విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంపై వివక్షను నిరసిస్తూ,తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల రక్షణ,సాధనే లక్ష్యంగా పదవులను తృణ ప్రాయంగా త్యాగం చేసి ఉద్యమించిన తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన అన్నారు.తెలంగాణ జాతి గర్వపడే నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, హైదరాబాద్ రాష్ట్ర విముక్తి కోసం పోరాటం చేసిన సమరయోధుడని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనతోనే తెలంగాణ ప్రజల హక్కుల సాధన సాధ్యమని తెలంగాణ తొలి ఉద్యమ కాలం నుండి పోరాటం చేశారని గుర్తు చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణ ప్రాంత హక్కులు హరించా రని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే ప్రజలకు నీళ్ళు,నిధులు, నియామకాల్లో సంపూర్ణ వాటా లభిస్తుం దని, తెలంగాణ అభివృద్ధి చెందుతుందని స్ఫూర్తి నింపారు.రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల అమలు కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చినప్పుడే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళులు అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ జాతి పితగా గుర్తించాలని,ఆయన జీవిత చరిత్రను భావి తరానికి తెలియజేసేందుకు పాఠ్యంశంగా చేర్పిం



చేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల రాదా అదిరెడ్డి,ఉపసర్పంచ్ శేఖర్, ప్యాక్స్ చైర్మన్ మహిపతి, పద్మశాలి అధ్యక్షుడు బైరి గంగాధర్,పద్మశాలి రాష్ట్ర కార్యదర్శి సురేష్, ప్రధాన కార్యదర్శి సామల్ల మహేష్, ఉపాధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ నాయకులు గోపి రాజారెడ్డి, జలంధర్ రెడ్డి, విడిచి చైర్మన్ కంటే విష్ణు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు కొత్తలు తేలేదు

## - మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



**సూర్య మల్యాల**

బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు కొత్తలు తేలేదని కరీంనగర్ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గురువారం మల్యాల మండలంలోని రాంపూర్ శివారు లో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 2004లో ఐదుగురు ఎంపీలు గెలిచి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్ లో తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ తో కలిసి గళమెత్తి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజల తిరుగుబాటు తప్పదని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకంలో 45టీఎంసీల సామర్థ్యం ఉన్న చిన్న ,చిన్న రిజర్వయర్ల సామర్థ్యం 250 టీఎంసీలకు పెంచడంతోనే అంచనా వ్యయం పెరిగిందని పేర్కొన్నారు.2006లో తెలంగాణ ఇస్తామని అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, 2009లో మళ్ళీ కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళితే 2014లో అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక రోజుకు 18 గంటలుపనిచేశారని కేవలం మూడున్నరేళ్ల కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయడం జరిగిందన్నారు.కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి పథకంపై ఫైనాన్స్ మంత్రి, ఉన్నతాధికారులతో పది సార్లు చర్చించి నిర్ణయం తీసుకునేవారని అన్నారు. ప్రజలకు ఏది కావాలో ఆలోచన చేసి అమలు చేసేవారన్నారు.రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎట్టి పరిస్థితుల్లోనూ తలవంచే ప్రసక్తే లేదని, బలమైన ప్రతిపక్షంగా నిలబడి అధికారపక్షంపై పోరాటం చేయడం జరుగుతుందన్నారు. కేంద్రంలో పదేళ్ల కాలంగా ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారని 2014 నుంచి 2019 వరకు తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సమయంలో సీఎం కేసీఆర్ తో చర్చించి కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం వెయ్యి కోట్లు తీసుకొచ్చి కరీంనగర్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ తో పాటు కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు.జాతీయ రహదారుల కోసం కొట్లాడి కరీంనగర్ చుట్టుపక్కల నాలుగు జాతీయ రహదారులను నిర్మాణం చేయించడం జరిగిందన్నారు.కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో ఏం అభివృద్ధి చేశారని, ఎన్ని నిధులు తీసుకువచ్చారో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కరీంనగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం బండి సంజయ్ నయాపైసా నిధులు తేలేదు..నిధులు తెచ్చానని బండి సంజయ్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బండి సంజయ్ ఏనాడైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడా... తెలంగాణ రాష్ట్రం కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తీర్పును సిరసావహిస్తామని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై మళ్ళీ గులాబీ జెండా ఎగరాలని, కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ,ఎంపీపీ విమల సుదర్శన్, జడ్పీటీసి రామ్మోహన్ రావు, , సింగిల్ విండో ఛైర్మన్ లు మధుసూదన్ రావు, సాగర్ రావు, రామలింగారెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం శ్రీనివాస్ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి సుభాన్ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ లుబీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ను పరామర్శించిన జెడ్పీటీసీ

**సూర్య,రాయికల్**



రాయికల్ మండలంలోని సింగరావుపేట్ సర్పంచ్ దన్నపునేని రామచంద్ర రావు కు శస్త్ర చికిత్స జరగ గా రాయికల్ జడ్పిటిసి అశ్విని జాదవ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకు న్నారు.ఆమె వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# కోడి పందాలపై పోలీసులు ఉక్కుపాదం

## - అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తప్పవు: సిఐ లక్ష్మీ నారాయణ

**సూర్య మల్లాపూర్**



కోడి పందాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని ముత్యంపేట గ్రామ శివారు షుగర్ ఫ్యాక్టరీ దగ్గరలో కోళ్ల పందాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మెట్‌పల్లి సిఐ లక్ష్మీనారాయణ, మండల ఎస్ఐ నవీన్ తో కోడి పందాల స్థావరంపై మెరుపుదాడి చేయగా పోలీసులను చూసిన కొందరు పరారయ్యారు. ఈ దాడి లో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారని తెలిపారు. వారి వద్దనుండి నుండి మూడు పందెం కోళ్ళు, 4500 రూ.స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాల పై స్పెషల్ ఫోకస్ పెట్టమని నిర్వహనలకు పాల్ప డితే చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూర్య, కోరుట్ల టౌన్:**

విద్యుత్ వార్షిక మరమత్తులు దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనునట్లు ఏఈ శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కల్లూరు రోడ్, ఝాన్సీ రోడ్, భీముని దుబ్బ, ఆనంద్ నగర్, రామ కృష్ణ డిగ్రీ కళాశాల, గాయత్రీ బ్యాంకు, విజయ్ ఇడ్లి సెంటర్, ప్రకాశం రోడ్, హనుమందిర్ ఏరియాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనునట్లు ఆయన పేర్కొన్నారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం కేటీఆరే.

## - పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



సిరిసిల్ల పట్టణంలో పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత ప్రభుత్వంలో చేనేత జోలి శాఖ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు కారణమని పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు గోలి వెంకటరమణ ఆరోపించారు. గురువారం సిరిసిల్ల పద్మశాలి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర వ్యాపారులకు రావలసిన బకాయిలు చెల్లించకపోవడం వల్లనే ప్రస్తుతం పరిశ్రమలో సంక్షోభం నెలకొంది అన్నారు. బతుకమ్మ చీరల పేరుతో సిరిసిల్లలో ఉత్పత్తి చేస్తూ ఇక్కడ ఉత్పత్తి అయ్యే అనేక రకాల వస్త్రాల ఉత్పత్తిని నీరుగార్చారని ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలో బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేయడం వల్ల మిగతా కాటన్ పరిశ్రమ, పాలిస్టర్ పరిశ్రమ ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిందని ఆయన అన్నారు. బతుకమ్మ చీరల వల్ల కొద్ది మందికి మాత్రమే లాభం చేకూరిందని మిగతావారు నష్టపోయారని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉందంటూ ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన గోలి వెంకటరమణ, నెల రోజుల క్రితం వరకు రాష్ట్రంలో టిఆర్ఎస్ పరిపాలన ఉందన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకోవాలని అన్నారు. వస్త్ర పరిశ్రమ ను ఆదుకోవాలని ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి బహిరంగ లేఖ రాయడాన్ని ప్రస్తావించిన ఆయన ఎంపీగా బండి సంజయ్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఏం చేశారు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మోర రవి ప్రధాన కార్యదర్శి గోనె ఎల్లప్పతోపాటు సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దాడి కేసులో నిందితునికి మూడేళ్ళు జైలు ,ఐదువేలు జరిమానా

**సూర్య కోనరావుపేట**

నగదు లావాదేవీల విషయంలో జరిగిన దాడిలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మూడేళ్ళ జైలు శిక్ష విధించింది. వివరాల ప్రకారం... 2016 ఆగస్టు 23న రోజున కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన చల్ల రాజిరెడ్డి అనే వ్యక్తి రాస నారాయణ రెడ్డి పై డబ్బుల విషయానికి సంబంధించి దాడి చేశాడు.నారాయణ రెడ్డి ని గాయపరిచాడు.కోనరావుపేట పోలీసు స్టేషన్ పోలీసులు కేస్ నమోదు చేసుకొని చల్ల రాజిరెడ్డి పై కోర్టుకు ఛార్జిషీట్ సమర్పించారు.విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు రాజిరెడ్డికి మూడేళ్ళు జైలు శిక్ష,5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



# విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం..

## - పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసులను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం..

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

డిస్టిక్ లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అధ్యక్షతన గురువారం జరిగింది. ఇప్పటివరకు నమోదైన అట్రాసిటీ కేసులను ఎటువంటి జాప్యం లేకుండా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వివిధ స్థాయిలలో పెండింగులో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని అన్నారు. ఎస్సీ ఎస్టీలపై ఎటువంటి అణచివేతలకు తావు లేకుండా వారి భూములు కబ్జా కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టబద్రుల ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి ఆదేశించారు. ప్రతినెల జరిగే పౌర హక్కుల దినోత్సవం లో ఆర్డీవో, తహసిల్దార్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లు తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆదేశించారు. సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే సంజయ్, అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, జగిత్యాల మెట్పల్లి ఆర్డీవోలు, జగిత్యాల డిఎస్పి వెంకటస్వామి, మెట్పల్లి డి.ఎస్.పి, ఎస్సీ ఎస్టీ అభివృద్ధిశాఖ అధికారి కే రాజ్ కుమార్, జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు టీవీ సూర్యం, దుమాల రాజ్ కుమార్, ఇతర సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ రాజేశ్వర నాగాలాయం లో పలు టెండర్లకు ఆహ్వానం.

**సూర్య, రాయికల్**

రాయికల్ మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కొత్తపేట గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో విక్రం తెలిపారు.ఈనెల 22న ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఆలయ ఆవరణలో గల మామిడి తోట ఐదు ఎకరాలకు రూ.5వేల ధరావత్ చెల్లించాలని,దీని కాలపరిమితి ఐదు నెలలు అని, అలాగే కొబ్బరి కాయలు,పూజ సామాగ్రి కి రూ.10 వేలు,లడ్డు,పులిహోర ప్రసాదం కు రూ.2వేలు,తలనీలాలు ప్రోగు కోసం రూ.1వేయి,కొబ్బరి ముక్కలు ప్రోగు కోసం రూ.1వేయి దరావతు చెల్లించి టెండర్ లో పాల్గొనవచ్చు అని,వీటి కాల పరిమితి ఏడాది పాటు వుంటుందని తెలిపారు.అలాగే మహా శివ రాత్రి పండగ సందర్భంగా బెల్లం విక్రయించడానికి రూ.2 వేలు దరావతు చెల్లించి టెండర్ లో పాల్గొనాలని ఆయన తెలిపారు.ఇట్టి వేలం పాట ఈ నెల 22 రోజున నిర్వహించడం జరుగుతుందని, ఎట్టి వేలం పాటలో హెచు పాటాదారుడు టెండర్ లో సగం డబ్బులు వెంటనే డిడి రూపంలో చెల్లించి ఇవ్వవలసి ఉంటుందని, ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

# ప్రొసీడింగ్ అందజేసిన ఎంపీ

**సూర్య, కోరుట్ల టౌన్**



పట్టణంలోని అభినవ శబరిమళగా పిలవబడే అయ్యప్ప దేవాలయానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కోరుట్ల అయ్యప్ప దేవాలయం యొక్క బృందావన్ గార్డెన్స్, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కొరకు అయ్యప్ప ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు చిదురాల నారాయణకి ఐదు లక్షల రూపాయల ప్రొసీడింగ్స్ పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, కనపర్తి(దుబాయ్) శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆ 'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## - నిమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కలుసుకొని ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. ప్రతి సంవత్సరం ఇలాగే అందరం కలుసు కోవాలని నిర్ణయించుకున్నారు.ఇక నుంచి టచ్ లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్‌ఫో న్లలో బంధించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అంజయ్య, రాజయ్య, రవీందర్, సదానందం, రాజకుమార్, శ్రీనివాస్, లతా, విద్యార్థులు వెంకటేష్, దేవకిషన్, పూర్ణచందర్, రాజు, ప్రవీణ్, మమత, శ్రీవాణి, రేఖ, లత తదితరులు పాల్గొన్నారు.

# విహారయాత్రలో విద్యార్థులు

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలంలోని మార్గదర్శి పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా భద్రాచలం సీతారాముల ఆలయాన్ని, పర్ణశాల దర్శించుకుని పాపికొండల యాత్ర చేశారు. వీటితోపాటు లక్నవరం వంతెన,రామప్ప,వేయిస్తంభాల గుడి వంటి పలు దర్శనీయ ప్రదేశాలను సందర్శించారు.విహారయాత్రతో చాలా విషయాలు తెలుసుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చిరంజీవి ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**సూర్య-గోదావరిఖని:**
ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరగబోయే వనదేవతలు సమ్మక్క-సారలమ్మ జాతర కు వచ్చే భక్తులు ఏటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండలంలోని గోలివాడలో సమ్మక్క -సారలమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదావరిఖని పట్టణానికి సమీపంలోని గోదావరి నది ఒడ్డున, అంతర్గాం గోలివాడ ప్రాంతంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే వనదేవతల జాతరకు లక్షల్లో జనం హాజరయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా ఏర్పాట్ల విషయంలో ఎక్కడ కూడా అలసత్వం ప్రదర్శించకూడదని హెచ్చరించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద



ఏర్పాట్లు, ఇతరత్రా ఏర్పాట్ల కోసం ఎన్టీపిసి, సింగరేణి సంస్థల సహాయం తీసుకోవాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్ సౌకర్యం, క్యూలైన్లు, అవసరమైన టాయిలెట్ల ఏర్పాటు, షాప్ ల ఏర్పాట్లు మొదలగు ప్రతిపాదనలు జనవరి 19 శుక్రవారం లోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర నిర్వహణ సమయంలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన మేర కార్మికులను ఏర్పాటు చేయాలని తెలిపారు. స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు నిర్మించాలని, విద్యుత్ దీపాలంకరణ సాయంత్రం నుండి ఉదయం వరకు నిరంతరాయంగా సాగేటట్లుగా చూడాలని, విద్యుత్ అంతరాయం కల్గకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. జాతర నిర్వహణకు సంబంధించి పోలీస్, నీటిపారుదల, రెవెన్యూ దేవాదాయ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా జాతరను నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ హనుమాన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, తహసిల్దార్ రాంమోహన్, ఎంపీడీవో యాదగిరి, ఇతర అధికారులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ రామగుండం మండలంలోని సుందిళ్ల గ్రామ శివారులో డంపింగ్ యార్డ్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



## ప్రతి ఫిర్యాదు పై స్పందించాలి.

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**సూర్య కోనరావుపేట**
స్టేషన్ వచ్చే ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం కోనరావుపేట పోలీస్ స్టేషన్ ను ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డితో ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ... స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్ లను, 5%ూ% అమలు తీరును పరిశీలించి, స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్ తదితర రికార్డ్ లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ అధికారులు, సిబ్బంది అందరు అంకిత భావంతో పని చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాల్లో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది తరచు పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. విలేజీ పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలల్లో పర్యటిస్తూ గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలతోపాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ తనిఖీ లో చందుర్తి సి.ఐ కిరణ్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ సౌత్ జోన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

**సూర్యకోనరావుపేట**
ఈనెల 18 నుంచి 21 వరకు తమిళనాడులో జరిగే సౌత్ జోన్ ఖేలో ఇండియా వూషూ ఉమెన్స్ లీగ్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కిక్ బాక్సింగ్ జిల్లా ప్రెసిడెంట్ అక్కెనపల్లి వినోద్ తెలిపారు. స్పోర్ట్స్



అథారిటీ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో జూనియర్ సీనియర్ విభాగాల్లో 46 మంది వివిధ కేజీల విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడగా సిరిసిల్ల జిల్లా నుంచి కోనరావుపేట మండలం ఎగ్లాసుపూర్ గ్రామానికి చెందిన పసుల జెస్సికా (39కేజీ విభాగంలో) నూకల సుదీప్తి (33కేజీల విభాగంలో) ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎంపిపి చంద్రయ్య గౌడ్, కరాటే ఇన్ స్ట్రక్చర్ ప్రియాంక, రోహిత్ తదితరులు అభినందించారు.

## సాగు పద్ధతిలో సాంకేతికత అవసరం

**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**సూర్య-గోదావరిఖని:**



వ్యవసాయ రంగంలో వచ్చే నూతన సాగు పద్ధతులు, సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకుంటూ అధిక లాభాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామంలో డ్రోన్ పరికరం ద్వారా మార్తా రాములు వరి సాగు చేస్తున్న పొలంలో చేసిన ఎరువుల పిచికారి విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత కారణంగా రైతులు అధునాతన సాంకేతిక వైపు మల్లాలని, దీని వల్ల ఖర్చు, సమయం రెండు తగ్గుతాయని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ అధికలాభాలు పొందే విధంగా రైతులు డ్రోన్ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇట్టి డ్రోన్ పరికరాన్ని అంతర్గాం మండలం రాయదండి గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు పల్లె రాజు, శ్యామ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పెద్దపల్లి బ్రాంచ్ నుంచి రూ.25 లక్షల రుణ సదుపాయం పొంది కొనుగోలు చేశారని, 20 లీటర్ల కెపాసిటీతో డ్రోన్ ట్యాంక్ ఉందని, దీని ద్వారా ఒక ఎకరం సంబంధించి ఎరువులు, విత్తనాలను 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో చల్లడం పూర్తి చేయవచ్చని తెలిపారు. డ్రోన్ పరికరం వినియోగం, ఇతర వివరాల కొరకు పల్లె రాజు కు సంబంధించిన మొబైల్ ఫోన్ నెంబర్ 9059960245 నందు సంప్రదించాలని కలెక్టర్ చెప్పారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి బి.రాంబాబు తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## అంధకారంలో సిరిసిల్ల పట్టణం

**- బకాయిలు చెల్లించ లేదంటూ సరఫరా నిలిపివేసిన విద్యుత్ అధికారులు**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**
సిరిసిల్ల పట్టణ గురువారం అంధకారంలో కూరుకుపోయింది. విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదంటూ సెస్ అధికారులు మున్సిపల్ కార్యాలయం తో పాటు వీధిలైట్లకు సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణం మొత్తం అంధకారమైంది. పట్టణంలోని మునిసిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఆఫీస్, మిని స్టేడియం, దోభి ఘాట్, గీతా నగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, స్ట్రీట్ లైట్స్ లకు సెస్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మున్సిపల్ నుండి 1కోటి 58 లక్షల బకాయిలు రావలసి ఉందని, బకాయిల కోసం పలుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించలేదని సహకార విద్యుత్ సరఫరా సంస్థ అధికారులు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లోని మునిసిపల్ తో పాటు మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటన్నింటికీ విద్యుత్ నిలిపివేశామని అధికారులు వెల్లడించారు.





### బకాయిలు నిజమే, త్వరలో చెల్లిస్తాం

**-మున్సిపల్ కమిషనర్**

సెస్ సంస్థకు మునిసిపల్ నుంచి చెల్లించిన బకాయిలు కోటి 58 లక్షలకు పైగా ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ వెల్లడించారు. సెస్ అధికారులతో మాట్లాడామని ,విద్యుత్ పునరుద్ధరించేందుకు అంగీకరించారన్నారు. శుక్రవారం ఉదయం సెస్ అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

## రుద్రంగి ఎస్ఐగా ఎస్.అశోక్ బాధ్యతలు స్వీకరణ

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండల ఎస్ఐగా ఎస్.అశోక్ గురువారం పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ రాజేష్ జిల్లాకు ఎఆర్ బదిలీ కాగా చందుర్తిలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎస్ఐ ఎస్. అశోక్ బదిలీపై రుద్రంగి పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.అశోక్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల లో శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో ఎక్కడైనా అసంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అపరిచిత వ్యక్తులు కనిపించిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాలు పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సిసిరోడ్లను ప్రారంభించిన ఎంపిటిసి జడల పద్మలత

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో 4 లక్షల ఎస్.డి.ఎఫ్ వ్యయంతో సిసి రోడ్ల పనులను గురువారం ఎంపిటిసి జడల పద్మలత రమేష్, ఉప సర్పంచ్ చింతల శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈ సిసి రోడ్ల ను గిరవేన కోమల్ ఇంటి నుండి భాషణవేని సమ్మయ్య, అలాగే సింగిరెడ్డి రాంరెడ్డి ఇంటి నుండి సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ఇంటి వరకు సిసి రోడ్డును కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జున్నుతుల తిరుపతి రెడ్డి, వంగల కొండాల్ రెడ్డి, కోమల్ రెడ్డి, సమ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

**- జిల్లా సమన్వయ అధికారి పి. వేంకటేశ్వరరావు**

**సూర్య జగిత్యాల**



తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు గడవు ఈనెల 20 వరకు పొడిగించారని మేడిపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్, జగిత్యాల జిల్లా సమన్వయ అధికారి పి. వేంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2023- 24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న వారు 5వ తరగతికి, 10వ తరగతి పూర్తి చేసుకోబోయే విద్యార్థులు ఇంటర్మీడియట్ కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. సంబంధిత దరఖాస్తులను 5వ తరగతికి రూ.100, ఇంటర్ కు రూ. 200 ఫీజుతో ఆన్లైన్లో సమర్పించాలని కోరారు. 2024 ఫిబ్రవరి 11న ఉదయం 11 గం.ఎల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 5వ తరగతికి ప్రవేశ పరీక్ష సంబంధిత పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. దీనికొరకు 4వ తరగతి బోనఫైడ్ లేదా స్టడీ సర్టిఫికెట్ ఆన్లైన్లో సమర్పించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఒక సెల్ నెంబర్ తో ఒకే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ tswrcoe సెట్-2024, tgcet.cgg.gov.in లో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కొరకు 9704550173 నెంబర్ లో సంప్రదించాలన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

**- తహసిల్దార్ శ్రీలత**

**సూర్య రుద్రంగి**



సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని రుద్రంగి తహసిల్దార్ శ్రీలత అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలో రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు, అంగన్వాడీ టీచర్లలతో తహసిల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీలత మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు లేని వారు ఓటు హక్కు నమోదు చేసుకోవడంతో పాటు జాబితాలో పేర్లు తప్పులుంటే సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు నమోదు కొరకు తమ బూత్ పరిధిలోని బి ఎల్ ఓ లను, తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు బూత్ లెవల్ అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## కొడిమ్యాలలో ఘనంగ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**సూర్య కొడిమ్యాల:**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని అంగడి బజార్ వద్ద గురువారం రోజు తెలుగు దేశం పార్టీ వ్యవస్తాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఇరవై ఎనిమిదోవ వర్ధంతి వేడుకలను తెలంగాణ తెలుగుదేశం పార్టీ కొడిమ్యాల మండల అధ్యక్షులు గుర్రం నర్సయ్య గౌడ్, ఆధ్వర్యం లో చాలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం నర్సయ్య గౌడ్, మాట్లాడుతూ పేద ప్రజలకు అనేక విధాలుగా అభివృద్ధి నీ అందించాడని ప్రజల గుండె లో ఉన్న ప్రజా నాయకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం మండల పార్టీ అద్యక్షులు గుర్రం నర్సయ్య గౌడ్, గజ్జెల కరునాచరి, గుర్రం మల్లేశం గౌడ్, యెళ్ళం పరమేష్, గుండేటి రమేష్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.